

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివ శంకర్, ఎమ్మెల్యే డాక్టర్ శ్రీనివాసరెడ్డి, జేసీ

ట్రాఫిక్‌పై.. ఫోకస్

- గత తిరునాళ్లలో ట్రాఫిక్ నియంత్రణలో విఫలం
- భక్తులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు..
- విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు
- ఈ సారి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ప్రణాళికలు
- విధి నిర్వహణలో అలసత్వం వహించేవారిపై చర్యలు తీసుకోవాలి
- భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు: కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట, ఫిబ్రవరి 13: ట్రాఫిక్‌ను నియంత్రించడంలో గత తిరునాళ్లలో పోలీసుశాఖ విఫలమైంది. ట్రాఫిక్ జామ్‌తో భక్తులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విధి నిర్వహణలో పోలీసు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి తలెత్తింది. కొందరు పోలీసులు సెల్‌ఫోన్లు చూస్తూ కూర్చోవడాన్ని నేను గమనించాను. ఈసారి తిరునాళ్లలో ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీసుశాఖ చర్యలు తీసుకోవాలి. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు ఇప్పటినుంచే చేయాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి స్పష్టం చేశారు. మహా శివరాత్రి సందర్భంగా కోటప్పకొండలో మార్చి 8న జరగనున్న త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల ఏర్పాట్లపై కలెక్టర్ అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది.

కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ ట్రాఫిక్ సక్రమంగా నిర్వహించ గలిగితే తిరునాళ్ల విజయవంతం అయినట్లేనన్నారు. తిరునాళ్లకు సంబంధించిన సమాచారం తెలియజేసేలా బోర్డులు ఏర్పాటు చేయాలని అదేశించారు. పరిశుభ్రత, తాగునీరు, వైద్యం అంశాల్లో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వీఐపీలు బస్సులో కొండపైకి రావాలని సూచించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తిరునాళ్లలో ట్రాఫిక్ నియంత్రణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. గత ఏడాది జరిగిన లోపాలను గుర్తించి ఈ సారి వాటిని పునరావృతం కాకండా ఉండేలా ఏర్పాట్లు చేయాలన్నారు. దివ్యాంగుల కోసం వలంటీర్లను, వీల్ చైర్లను ఏర్పాటు చేయాలన్నారు. పెట్లూరివారిపాలెం రహదారిలో వన్‌వే నిర్వహించాలని సూచించారు.

ఘాట్ రోడ్డులో నడక నిషేధం...

భక్తులు సోపాన మార్గంతో పాటు ఘాట్ రోడ్డులో కూడా నడకతో కొండపైకి చేరుకుంటున్నారని, దీని వలన వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని జేసీ శ్యాంప్రసాద్ తెలిపారు. ఈ సారి తిరునాళ్ల రోజున ఘాట్ రోడ్డులో భక్తుల నడకను నిషేధిస్తున్నట్లు చెప్పారు. భక్తులకు వైద్య శిబిరాలు అందుబాటులో ఉండాలని, వైద్యాధికారులు విస్తృత ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. చలివేంద్రాలు అధికసంఖ్యలో ఏర్పాటు చేయాలని ఇందుకు దాతల సహకారం తీసుకోవాలని చెప్పారు.

నాలుగు క్యూలైన్లు..

భక్తులు శ్రీత్రికోటేశ్వర స్వామిని దర్శించుకొనేందుకు నాలుగు క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉచిత, రూ.100, రూ.200, వీఐపీ దర్శనం రూ.300 క్యూలైన్‌లతో పాటు అభిషేకం రూ.500తో క్యూలైన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రెండు లక్షలు లడ్డు, లక్ష అరిసె ప్రసాదం సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. భక్తులకు పంపిణీ చేసేందుకు తాగునీరు, మజ్జిగ ప్యాకెట్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీఐపీల వల్ల భక్తులు ఇక్కట్లు పడ్డారని పలువులు సమావేశంలో ప్రస్తావించారు.

8 నుంచి 4 గంటల వరకు విద్యుత్ నిలిపివేత

తిరునాళ్లకు వచ్చే ప్రభల కోసం చిలకలూరిపేట రోడ్డులో యూటీ వద్ద ఉన్న హెటీ లైన్‌కు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతందని విద్యుత్ శాఖ ఈఈ ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. తిరునాళ్ల రోజున ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతందని చెప్పారు. అలాగే తిరునాళ్ల మరుసటి రోజు ప్రభలు తిరిగి గ్రామాలకు తరలించేందుకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

తిరునాళ్లకు సాగర్ నీరు..

తిరునాళ్లకు నీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. సాగర్ నుంచి తిరునాళ్లకు నీటికి సరఫరా చేసేందుకు కేఆర్ఎంబీ అనుమతి వచ్చినట్లు జలవనరుల శాఖ ఈఈ మల్లిఖార్జున రావు తెలిపారు. 1 నుంచి సాగర్ నుంచి నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు. చిలకలూరిపేట మేజర్‌లో నీరు ఉంటుందని చెప్పారు. అటవీ శాఖ అధికారి రామచంద్రరావు మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను నిషేదించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొండ దిగువన పారిశుధ్య పనులను డీపీవో విజయ భాస్కరరెడ్డికి అప్పగించారు. కొండ దిగువన తాగునీటి ఏర్పాట్లతో పాటు, 129 టాయిలెట్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఈఈ సురేష్ తెలిపారు. కొండకు ఉన్న రహదారులకు మరమ్మత్తు చేపట్టాలని నిర్ణయించారు. ఈ పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు.

వీఐపీలకు ఉచితం.. భక్తులకు టిక్కెట్

వీఐసీల బస్సులను ఏర్పాటు చేయలేమని ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసరావు తెలిపారు. భక్తుల వద్ద చార్జీ వసూలు చేస్తూ వీఐసీలకు ఉచిత ప్రయాణం కల్పించడం సరికాదని తమ ఎండీ అన్నారని చెప్పారు. వీఐపీల బస్సులకు నిధులు విడుదల చేయాలని కోరారు. ఏఎస్పీ రాఘవేంద్ర మాట్లాడుతూ టాఫ్రిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్‌వో వినాయకం, దేవస్థానం ట్రస్టీ రామకృష్ణ కొండలరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తిరునాళ్ల వరకు ఈవోగా శ్రీనివాసరెడ్డి..

కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వర స్వామి దేవస్థానం ఏసీని విధులల్లో చేరనివ్వకపోవడం వివాదస్పదమైంది. తిరునాళ్ల సమీక్ష సమావేశంలో ఈవో అంశం చర్చకు వచ్చిందంది. ఈవోగా జి.శ్రీనివాసరెడ్డి కొనసాగుతారని, అయన తిరునాళ్ల వరకు ఉంటారని ఎమ్మెల్యే డాక్టర్ శ్రీనివాసరెడ్డి ఆయకు భరోసా ఇచ్చారు. ఏసీ తిరునాళ్ల తర్వాత వస్తారని అయన ప్రకటించడం గమనార్హం. ఏసీ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి విధులు చేపట్టేందుకు తిరునాళ్ల వరకు ఆగాల్సిన పరిస్థితి. అయితే దేవాదాయ శాఖ అధికారులు ఏ విధంగా స్పందిస్తారో చూడాలి.


సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు

బాగుపడే.. దారెక్కడ?

కొత్తగా రోడ్ల నిర్మాణానికి కాదుకదా.. అధ్వానంగా తయారై, ప్రమాదకరంగా మారిన రోడ్ల మరమ్మతులకు కూడా ప్రభుత్వం నిదులు ఒక్క రూపాయి విదిల్చిన పాపానపోలేదు. గతంలో చేసిన పనులకు సంబంధించి బిల్లులు భారీగా ప్రభుత్వం దగ్గర పెండింగ్ ఉండటంతో అప్పట్లో ఒప్పందం కుదుర్చుకున్న కాంట్రాక్టర్‌లూ పనులు చేయలేమని చేతులెత్తేశారు. దీంతో ప్రధాన రహదారులకూడా డొంక రోడ్లకంటే హీనంగా తయారయ్యాయి. వీటిపై ఇటీవల కాగ్ అనేక అభ్యంతరాలు వ్యక్తం చేసింది. పనుల విషయంలో నిర్లక్ష్యం, నిధుల మంజూరులో జాప్యం, బిల్లుల చెల్లింపుల విషయంలో పట్టనట్టు వ్యవహరించటంపై కాగ్ తలంటినా ప్రభుత్వం మాత్రం మాకేటి సిగ్గన్నట్టు నిర్మాణ పనుల పురోగతిని గాలికొదిలేసింది. దీంతో మోకాళ్లలోతు గుంటలలో ప్రయాణించలేక, తప్పనిసరి అయి ఏదైనా వాహనంలో వెళ్లినా ప్రమాదాలకుగురై ప్రాణాలు పోగొట్టుకోవలసి రావటం దారుణమే.

- పాత పనులకు పాతర... కొత్త పనుల ఊసేలేదు
- నిధులివ్వని వైసీపీ ప్రభుత్వం... మధ్యలోనే ఆగిన పనులు
- అధ్వానంగా రోడ్లు, వంతెనలు
- గత టీడీపీ సర్కారు కాలంలో నిధుల మంజూరు
- వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఒక్కపైసా విదిలించింది లేదు
- బిల్లుల పెండింగ్‌తో పాత పనులు చేయలేమని చేతులెత్తేసిన కాంట్రాక్టర్‌లు
- కొత్త పనులకు నిధుల మంజూరు లేనేలేదు

తెనాలి, ఫిబ్రవరి 13, (ఆంధ్రజ్యోతి): గత దశాబ్దకాలంలో జరగనన్ని రోడ్డు ప్రమాదాలు ఈ నాలుగేళ్లలోనే జరిగాయని అయా శాఖలు ఇచ్చిన నివేదికలు ఇస్తున్నాయి. కొత్త రోడ్ల నిర్మాణం అటుంచితే, పాతవాటికి పాతరేయడంతో రోడ్లపై తిరుగుతున్న జనం నడ్డి విరుగుతోంది. ప్రభుత్వం అనేక రూపాల్లో ఇస్తున్న సంక్షేమం డబ్బంతా వైద్యానికే సరిపోతుందంటూ ప్రతిపక్షాలూ ఎద్దేవా చేస్తున్నాయి. కాగ్ ఇటీవల ఇచ్చిన నివేదికలో గత ప్రభుత్వ కాలంలో మంజూరు చేసిన పనుల పురోగతి, కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఇచ్చిన నిధుల పురోగతిపై నివేదిక


తెనాలి వీఎస్ఆర్ కళాశాల ఎదుట రహదారి దుస్థితి

ఇచ్చింది. పాత పనులు అటుంచితే, 2023లో మంజూరుచేసిన నిధులకు సంబంధించిన పనులు కూడా కేవలం 5 నుంచి 15 శాతంలోపే పూర్తికావటం విశేషం.

తెనాలి -విజయవాడ రోడ్డు పనులు హుష్..

తెనాలి- మంగళగిరి ప్రధాన రహదారి వెంట గోడల నిర్మాణం, రోడ్డు మరమ్మతులకోసం 2017లో రూ.46 కోట్లు కేటాయించారు. దీనితో రోడ్డుకు ఇరువైపులా తూర్పు, నిజాంపట్నం కాల్వల వెంట గోడలు నిర్మించాల్సి ఉంది. అయితే గోడల నిర్మాణం 2022వరకు చేసిన కాంట్రాక్టర్లు అప్పటి నుంచి బిల్లులు రాకపోవటంతో పనులు చేయటానికి చేతులెత్తేశారు. మంజూరు చేసిన పనుల్లో రూ.25కోట్ల వరకు పనులు మాత్రం పూర్తయ్యాయి. మొత్తంమీద కేవలం 2.8 కి.మీటర్ల పొడవున గోడలు, రోడ్డు అభివృద్ధి చెయ్యాల్సిఉంది. కానీ తెనాలి నుంచి మంగళగిరి మధ్య 1.5 కి.మీ నుంచి 3.8 కి.మీ మధ్య కేవలం 200 మీటర్ల వరకు మాత్రమే పని పూర్తిచేశారు. అయితే గతంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులే భారీగా పెండింగ్ ఉండటంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశారు. ఇదే రోడ్డు నందివెలుగు నుంచి రేవేంద్రపాడు వరకు గోడలు, రోడ్డు అభివృద్ధికి రూ.264 కోట్లు మంజూరు చేస్తూ సీఎం అంగీకరించారని జగన్ సర్కారు వచ్చిన రెండు నెలలకు తెనాలి, మంగళగిరి ఎమ్మెల్యేలు విలేకరుల సమావేశం పెట్టిమరీ ఆర్భాటంగా ప్రకటించారు. ఆ నిధులు ఇప్పటివరకు ఏమయ్యాయో తెలియదు. రోడ్డు అభివృద్ధి అటుంచితే, నందివెలుగు- రేవేంద్రపాడు మధ్య రోడ్డు దారుణంగా తయారైంది. గుంతలుపడి, కుంగి, వాహనాలు కాలువలలోకి దూసుకు పోతున్న పరిస్థితి. గతంలో కార్లు కాల్వలోకి బోల్తాకొట్టి పదుల సంఖ్యలో ప్రాణాలు పోయిన పరిస్థితి ఉంది. రూ.264 కోట్లతో అభివృద్ధి అటుంచితే, అసలు మరమ్మతులకు కూడా దిక్కులేకుండా పోయింది. ఇదే రహదారి వెంట ప్రజాప్రతినిధులు వెళుతూనే ఉంటారు. వి.ఎస్.ఆర్ కళాశాల దగ్గర నుంచి ఆటో నగర్ వరకు రోడ్డు తూర్పు కాల్వవైపు పూర్తిగా దెబ్బతింది. మధ్యలో డివైడర్లు ఉండటంతో విజయవాడ నుంచి తెనాలి వైపునకు వచ్చే ప్రజాప్రతినిధులు తమ వాహనాలను నిబంధనలకు విరుద్ధంగా కుడివైపు రోడ్డుపైకి మళ్లించటం విశేషం. దుగ్గిరాల- రేవేంద్రపాడు మధ్య ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేనంత దారుణంగా రోడ్డు తయారైందంటే దీనిపై శ్రద్ధ ఏపాటిదో అర్ధమవుతుంది. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రాజీనామా చేసిన తర్వాత ఇదే రోడ్డుపై ప్రస్తావన కూడాచేశారు. కనీసం దుగ్గిరాల వరకు రోడ్డుకూడా వేయలేకపోయానని, ఇది సిగ్గుగా ఉందని చెప్పారంటే ప్రభుత్వ వైఫల్యం ఏమేర ఉందనేది అర్థమవుతుంది.


అంగలకుదురు-దండమూడి మధ్య సగం పనులు జరిగితే అదికూడా ప్రస్తుతం గుంతలతో మారిన చిత్రం

చేబ్రోలు బ్రిడ్జికి గ్రహణం వీడేనా!

కొమ్మమూరు కాల్వపై చేబ్రోలు దగ్గర హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి 2019లోనే రూ.25కోట్లు మంజూరు చేశారు. ఈ వంతెన బ్రిటిష్ కాలంనాటిది కావటం, అప్పటినుంచి తాత్కాలిక మరమ్మతులు చేసుకుంటూవచ్చినా, శిథిల స్థితికి చేరుకోవటం, హైలెవల్‌లో ఉండటంతో భారీ వాహనాలు అదుపుతప్పి కాల్వలోకి దూసుకుపోవటం వంటి ఘటనలు చాలానే జరిగాయి. అప్పట్లో ఈ పాత వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మించాలి. అయితే అప్పట్లో జల రవాణా కింద ప్రధాన కాల్వ కింద ఇది ఉండటంతో నీటిపారుదల శాఖ అభ్యంతరం చెప్పింది. ఒకవేళ నిర్మిస్తే జల రవాణాకు సంబంధించి కాల్వ ఎంత వెడల్పు చేయాలనే ప్రతిపాదన ఉందో అంత వెడల్పు, కేంద్రం సూచించిన ఎత్తులో వంతెన నిర్మించుకుంటే అభ్యంతరం లేదని తేల్చి చెప్పటం, ఆ ప్రతిపాదనలు మళ్లీ రివైజ్ చెయ్యాల్సిరావటంతో అత్యవసరం కింద ప్రస్తుతం రూ.50 లక్షలతో ఇనుప గడ్డర్ల సాయంతో బయిలీ వంతెన నిర్మించాలని ఆర్అండ్‌బీ నిర్ణయించింది. దీనికోసం అప్పట్లో ఇనుప గడ్డర్లు తీసుకొచ్చినా వాటినీ నిర్మించకుండా వదిలేశారు. అప్పటి నుంచి దీని నిర్మాణానికి కొర్రీలు పడుతుండటం, జగన్ సర్కారు వచ్చాక కొత్త వంతెన నిర్మించటానికి 2023లో రూ.35కోట్లు మంజూరు చేయటం జరిగిపోయాయి. అయితే ఈ నిధులతో పనులు మొదలుపెడితే, మళ్లీ నీటిపారుదల శాఖ అభ్యంతరం వ్యక్తం చేసింది. అయితే ఈసారి కాంట్రాక్టర్ నీటిపారుదల శాఖ అభ్యంతరాలను తోసిపుచ్చి నిర్మాణ పనులను మొదలుపెట్టేసింది. అయితే రెండువైపులా నాలుగు పిల్లర్లు వేసి, పనులు చేస్తున్నామనిపిస్తున్నారు. దీనికోసం ఏకంగా బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని రైతుల పంటలకు నీటిని, తాగునీటిని ఆపేసి మరీ పనులు చేపట్టారు. అప్పట్లో రైతులు ఆందోళన చేయటంతో చివరకు పనులు మధ్యలోఆపి, నీటిని వదిలారు. ఇప్పుడు ఖరీఫ్ చివరి దశకుచేరి, రబీ సాగుకు నీటిని ఆపేశారు. దీనికితోడు పాత వంతెనకు అటో, ఇటో కొత్త వంతెన నిర్మించటం సహజం. అయితే అక్కడ ఇబ్బందులు, సాధ్యాసాధ్యాలను పరిశీలించాకే నిర్మాణ పనులు మొదలుపెడతారు. కానీ ఇక్కడ పొన్నూరు ఛానల్ ఉంటే, దాని కల్వర్టును మూసేసి మరీ వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. ఈ కాల్వ ద్వారా పొన్నూరు మండలంలోని 8 గ్రామాల పరిధిలోని పొలాలకు నీరు అందుతుంది. ఈ కాల్వను పూర్తిగా మూసేశారు. అయితే దీనిపై నీటిపారుదల శాఖ మాత్రం ఏ అభ్యంతరం చెప్పకుండా, రైతులు గోలపెడుతున్నా పట్టించుకోకుండా వదిలేసింది. వంతెన నిర్మాణానికి అన్ని రకాల అనుమతులు తీసుకోకపోవటం, నిర్మాణ సమయంలో ఇతర ఇబ్బందులను పట్టించుకోకపోటం విశేషం. 2023లో రూ.35 కోట్లు మంజూరుచేసినా పనులు మాత్రం భూమిలో పిల్లర్ల వరకే పరిమితమయ్యాయి. ఈ వంతెన విషయంలోనూ గందరగోళ పరిస్థితులు నెలకొన్నా అన్నీ గాలిలో పెట్టేశారు. అన్నీ లోపభూయిష్టంగా తయ్యాయి.



తెనాలి-విజయవాడ రోడ్డులో ఆటోనగర్ దగ్గర మూడేళ్ల క్రితం గోడలు నిర్మించి రోడ్డు పనులు చేయకుండా వదిలేసిన చిత్రం


గత ప్రభుత్వ కాలంలో గుంటూరు, బాపట్ల జిల్లాల్లో పలు రోడ్లకు భారీగానే నిధులు మంజూరు చేసింది. తెనాలి మండలం అంగలకుదురు నుంచి పొన్నూరు మండలం దండమూడి మధ్య రోడ్డు 8.7 కి.మీటర్లు వేసేందుకు 2017లో రూ.10 కోట్లు మంజూరు చేశారు. అంగలకుదురు నుంచి చుండూరు మండలం వలివేరు అవతల వరకు 8.7 కి.మీటర్ల మేర రోడ్డు నిర్మించాల్సి ఉంది. అయితే దీనిలో ఇప్పటి వరకు కేవలం 51 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఐదేళ్ల క్రితం 5 కి.మీ తారురోడ్డు వేసి వదిలేశారు. ఆ తర్వాత ప్రస్తుత సీఎం జగన్ పర్యటన ఉండటంతో వలివేరు దగ్గర కొంతమేర బి.ఎం మిక్స్‌తో రోడ్డు వేసి చేతులు దులుపుకొన్నారు. అయితే ఈ పనులకు మరో బిల్లు నొక్కేశారు. ఇంకా సీసీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణం ఉంటే వాటిని వదిలేశారు. తెనాలి నుంచి చందోలు వెళ్లే రోడ్డు వేయటానికి 2017లో రూ.8 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో అమృతలూరు మండలంలోని మందూరు వంతెన దగ్గర నుంచి పెదపూడి వంతెన వరకు నిజాంపట్నం కాల్వలోకి రోడ్డు కుంగి ఊబిలోకి దిగిపోయింది. యలవర్రు వంతెన దగ్గరా రోడ్డు దెబ్బతినిపోయింది. రోడ్డుకు ఇరువైపులా తూర్పు కాల్వ, నిజాంపట్నం కాల్వలు ఉండటంతో కాల్వల అంచుల వెంట గోడ నిర్మించాల్సిఉంది. దీనిలో ఇప్పటివరకు కేవలం రూ.3.5 కోట్ల పనులు మాత్రమే చేయగలిగారు. కొద్దిమేర గోడ నిర్మించారు. మరికొంత తారు రోడ్డు వేశారు. అయితే పూర్తిస్థాయిలో పనులు పూర్తిచేయటానికి అవసరమైన మిగిలిన నిధులను వైసీపీ సర్కారు మంజూరు చేయకపోవటంతో పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో లారీల దగ్గర నుంచి కార్లవరకు మార్గంలో కాల్వలోకి బోల్తాపడుతున్నాయి. రెండు కి.మీ మేర రోడ్డు మధ్యకు బద్దలుగా పగిలిపోయి భూకంపం వచ్చిన ప్రాంతాల్లో ఉన్న ట్టుగా కిందికి కుంగిపోయింది. ఇంతటి ప్రమా దకరంగా ఉన్నా జగన్ సర్కారు మాత్రం వీటిగోడు పట్టించుకున్నదే లేదు. పొన్నూరు మండలం నిడమర్రు నుంచి అమ్మ తలూరు మండలం ప్యాపర్రు వరకు రోడ్డు అభివృద్ధి కోసం రూ.2.5 కోట్లు కేటాయించారు. ఈపనులు 2023 నాటికే పూర్తి కావలసి ఉంటే ఇప్పటికి 5 శాతం పనులు కూడా పూర్తికాలే దు.దీనికీ నిధుల గ్రహణమే.



పోటెత్తిన మిర్చి

- ఒకే రోజున 2.50 లక్షలకు పైగా మిర్చి టిక్కీల రాక

గుంటూరు, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): మిర్చిలోడు లారీలు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (మిర్చియార్డు)కు పోటెత్తాయి. వందల సంఖ్యలో లారీలు, ట్రాక్టర్లు, ఆటోలలో మిర్చి టిక్కీలు లోడింగ్ చేసి రైతులు విక్రయానికి తీసుకురావడంతో యార్డు కిక్కిరిసిపోయింది. ఇంచుమించు రెండున్నల లక్షల మిర్చి టిక్కీలకు పైగా ఒకే రోజు రావడంతో యార్డులోకి ప్రవేశించే అవకాశమే లేకపోయింది. దాంతో మంగళవారం వేకువజామున 3 గంటల నుంచే గుంటూరు - హైదరాబాద్ రోడ్డులో ఒకవైపు మిర్చి లారీలు నిలిచిపోయాయి. మిర్చియార్డు గేటు నుంచి దాదాపుగా కిలోమీటర్ దూరం వరకు లారీలు మూడు వరసల్లో బారులు తీరడంతో ట్రాఫిక్ స్తంభించిపోయి సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనిని పరిగణనలోకి తీసుకొన్న మార్కెట్ కమిటీ పాలకవర్గం, అధికారులు మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు యార్డులోకి సరుకు దిగుమతిని అనుమతించకూడదని నిర్ణయించారు. బుధవారం రాత్రి నుంచి తిరిగి సరుకు అనుమతిస్తామని ప్రకటించారు.


మిర్చియార్డులో కిక్కిరిసిన టిక్కీలు

రంగంలోకి రాయలు

- డాక్టర్లు.. ఉపాధ్యాయులతో భేటీ
- మీకే మా మద్దతని ప్రకటించిన ఉపాధ్యాయులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా బరిలో దిగేందుకు లావు శ్రీకృష్ణదేవరాయలు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అన్ని వర్గాల నుంచి మద్దతు కూడగట్టుకొనే పనిలో ఆయన నిమగ్నమయ్యారు. మరో వైపు రానున్న వారంలో లావు టీడీపీలో చేరేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తనతో పాటు వైసీపీలో ముఖ్యనేతలు కూడా టీడీపీలో చేరేందుకు సమయత్తం అవుతున్నారు. పార్టీలో చేరే ముహూర్తం ఖరారు చేసుకుంటూనే నియోజకవర్గంలోని తెలుగుదేశం నేతలతో తన పోటీ అంశంలో చర్చలు జరుపుతున్నారు. ఇప్పటికే పలువురు టీడీపీ నేతలు ఆయనను కలసి మద్దతు తెలిపారు. టీడీపీ తనను అభ్యర్థిగా ఖరారు చేసిన అనంతరం నరసరావుపేటలోని తన కార్యాలయానికి లావు మంగళవారం వచ్చారు. ఈ నేపథ్యంలో అయనను పలువురు నేతలు కలిశారు. మరో వైపు ఉపాధ్యాయులు రాయలును కలసి వారి మద్దతును తెలియజేశారు. మరో వైపు ప్రముఖ వైద్యుడు డాక్టర్ మర్రి పెద్దయ్య ఇంటిలో ఏర్పాటు చేసిన విందుకు లావును ఆహ్వానించారు. నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులపై వైద్యులతో లావు చర్చించారు. టిక్కెట్ రేసులో ఉన్న నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ చదలవాడ అరవిందబాబు, టీడీపీ డాక్టర్స్ సెల్ ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు విందు భేటీలో పాల్గొన్నారు. లావులో డాక్టర్స్ విందు రాజకీయ ప్రాధాన్యం సంతరించుకొంది. ఈ ఎన్నికల్లో ఇక్కడ తెలుగుదేశం జెండా ఎగురవేయాలని ఇందుకు కలసికట్టుగా వచ్చే ఎన్నికల్లో పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని పలువురు డాక్టర్లు పేర్కొన్నారు. లావుకు సంపూర్ణ మద్దతు తెలిపారు.

మా మద్దతు మీకే...

మా మద్దతు మీకే.. ఈ ప్రభుత్వం వేధింపులతో తీవ్ర ఇబ్బందుకు ఎదుర్కొంటున్నాం. మీ విజయానికి కృషి చేస్తాం అని ఉపాధ్యాయులు ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలుకు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఐదేళ్లలో టీచర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వారు ఎంపీ వద్ద ఏకరవు పెట్టారు. వివిధ సామాజిక వర్గాలకు ప్రతినిధులుగా ఉన్న దాదాపు 7 గురు ఉపాధ్యాయులు మాట్లాడారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పారు. వచ్చే ఎన్నికల్లో లావుకు మద్దతు ఇవ్వనున్నట్టు వారు ప్రకటించారు. దాదాపు రెండు వందల మంది ఉపాధ్యాయులు ఎంపీతో భేటీ అయ్యారు. తెలుగుదేశం ప్రభుత్వం రాగానే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని లావు హామీ ఇచ్చారు. ప్రైవేట్ స్కూల్స్ నిర్వాహకుల యూనియన్ నేతలు కూడా ఎంపీని కలిసిన వారిలో ఉన్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు ఎంపీని కలసి మద్దతు తెలిపారు.



మాట్లాడుతున్న ఎంపీ లావు కృష్ణదేవరాయలు, డాక్టర్ అరవిందబాబు, డాక్టర్ కడియాల, హాజరైన వైద్యులు



తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో జై అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

నాలుగున్నరేళ్లు నయవంచన పాలన

● 1519వ రోజుకు చేరిన రాజధాని రైతుల ఆందోళనలు

తుళ్లూరు, ఫిబ్రవరి 13: రాష్ట్ర ప్రజలు సీఎం జగన్‌రెడ్డిని నమ్మే పరిస్థితిలో లేరని రాజధాని అమరావతి నిర్మాణానికి 33వేల ఎకరాలు భూములు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు మంగళవారం నాటికి 1519వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, అధికారం చేపట్టబోయేముందు అమరావతిని బ్రహ్మాండంగా కడతామని చెప్పావు.. ఎక్కడ, ఏదీ అని ప్రశ్నించారు. పోలవరం 2022 నాటికి పూర్తి చేస్తానని అన్నావు.. ఎక్కడ..? ప్రత్యేక హోదా తెచ్చి రాష్ట్రంలోని మూడు ప్రాంతాలను అభివృద్ధి చేస్తానని అన్నావు.. ఏదీ.. ఎక్కడ.. ఇంకెప్పుడూ? అంటూ ప్రశ్నించారు. నాలుగున్నర ఏళ్లుగా నయవంచనతో పరిపాలన చేశావు.. అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్‌ను ఇరవై సంవత్సరాలు వెనక్కి నెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ స్వలాభం కోసం కక్షతో అమరావతిని మూడుముక్కల ఆటతో నిర్వీర్యం చేశారని ఆరోపించారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. తుళ్లూరు, వెంకటపాలెం, మందడం, వెలగపూడి, అనంతవరం, నెక్కల్లు, తదితర రాజధాని గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

ఐదేళ్లుగా రాష్ట్రంలో అరాచక పాలన

● శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్



ముస్లిం మైనారిటీ ఆత్మీయ సదస్సులో మాట్లాడుతున్న శాసనమండలి మాజీ చైర్మన్ అష్రఫ్ షరీఫ్, పక్కన మాజీ ఎమ్మెల్యే యరపతినేని తదితరులు



శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్, మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావులను గజమాలలతో సత్కరిస్తున్న మైనారిటీ సోదరులు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 13: ఐదేళ్లుగా ఏపీలో అరాచకపాలన సాగుతోందని, ఒక్కచాన్స్ అంటూ మాయమాటలు చెప్పి మన ఓట్లు గుంజేసుకున్న జగన్ మైనారిటీలను దగా చేశాడని శాసనమండలి మాజీ చైర్మన్ అహ్మద్ షరీఫ్ అన్నారు. మంగళవారం రాత్రి పిడుగురాళ్లలో మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురజాల నియోజకవర్గస్థాయి మైనారిటీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో షరీఫ్ మాట్లాడుతూ 100 రూపాయలకు బటన్ నొక్కి వెయ్యిరూపాయలు లాగేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరలో పడ్డాయన్నారు. గురజాల నియోజకవర్గంలో ముస్లింలపై దాడులు జరిపిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి ఓటు వేయొద్దన్నారు. పల్నాడు ప్రాంతానికి గుండెకాయ లాంటి యరపతినేని ముస్లిం మైనారిటీలకు అండగా వుండటం మీ అందరి అదృష్టం. పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షేక్ నాగుల్‌మీరా మాట్లాడుతూ వైసీపీ హయాంలో ముస్లిం మైనారిటీలకు ఎంత ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదలచేయాలని డిమాండ్ చేశారు. యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక గురజాల నియోజకవర్గంలో మైనారిటీలపై ఎన్నో దాడులు, అత్యాచారాలు, హత్యలు జరిగాయని గుర్తుచేశారు. ఐదేళ్లలో నియోజకవర్గంలో ఏ మైనారిటీ కుటుంబానికైనా, హజ్‌యాత్రకు వెళ్లే వారికెవరికైనా రూ.5 వేలు కాసు మహేష్‌రెడ్డి అందించాడా? అలా వుంటే వారి పేరు చెప్పాలన్నారు. గురజాలలో అవినీతి సంపాదనకు అలవాటుపడిన కాసును ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఎన్నికల్లో ఏడవ సారి గురజాల నుంచే పోటీ చేయనున్నట్లు యరపతినేని స్పష్టం చేశారు. మైనారిటీలకు తానెప్పుడూ అండగా వుంటానని, పిడుగురాళ్లలో ఓ మైనారిటీ కుటుంబంలో కుమారులు ఇద్దరు చనిపోగా, ఆ కుటుంబానికి పెద్దబిడ్డగా వుంటానని ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షలు అందించి ఆ తల్లికి పాదాబివందనం చేసిన విషయాన్ని యరపతినేని గుర్తుచేశారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు నాయబ్ కమాల్, ఎండీ నజీర్, నసీర్ అహ్మద్, బాబావలి, అమీర్‌అలితో పాటు తదితర నాయకులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో ప్రత్తిపాటి చాయ్‌పే చర్చా



టీ దుకాణం వద్ద మాజీ మంత్రి ప్రత్తిపాటి మాటా మంతి

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 13: ప్రచారమంటే తాము చెప్పేదే కాదు, ప్రజలు చెప్పేది.. వారి కష్టాలు వినటం.. వారి మనిషిగా మేమున్నాం అన్న భరోసా కల్పించటం అని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. పార్టీ తరుపున ప్రచారంలో భాగంగా పట్టణంలో తొలిసారి చాయ్‌పే చర్చా తరహాలో ఓ టీస్టాల్ వద్ద ఆగి స్థానికులతో మమేకమయ్యారు. బాబు షూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమానికి వెళ్తున్న ప్రత్తిపాటి సీఆర్ కాలనీలో దోస్తి కేఫ్ వద్ద ఆగి స్థానికులతో చర్చించారు. టీ విక్రయ దారులతో మాట్లాడి వారి అభిప్రాయాలు, అనుభవాలు రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన కూటమి ప్రభుత్వం ఏర్పాటు తరువాత ప్రజలు ఏం ఆశిస్తున్నారో వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భారంగా మారిన నిత్యావసరాల ధరలు, ప్రభుత్వ పనులు, కరెంటు బిల్లులు భారంగా మారాయని ప్రత్తిపాటి వద్ద వాపోయారు. మరో రెండు నెలల్లో వాటన్నింటిని నుంచి ప్రజలకు విముక్తి లభిస్తుందని, సైకో సీఎం పీడ వదిలిపోతుందని ప్రత్తిపాటి తెలిపారు.

భారీ స్థాయిలో నగదు, బంగారం స్వాధీనం

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 13: నరసరావుపేట సమీపంలో కాచిగూడ - గుంటూరు రైల్లో ఇరువురు వ్యక్తుల వద్ద నుంచి మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో రూ.11.14లక్షల నగదు, 391 గ్రాముల బంగారు ఆభరణా లను స్వాధీనం చేసుకున్నట్టు నరసరావుపేట రైల్వే ఎస్ఐ సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల దృష్ట్యా ఉన్నతాధికా రుల సూచనల మేరకు అక్రమ ధనం తరలించటాన్ని అరికట్టడానికి తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మంగళవారం కాచిగూడ - గుంటూ రు రైల్లో వినుకొండ నుంచి నరసరావుపేట వరకు తనిఖీలు నిర్వహిస్తుండగా విజయవాడకు చెందిన దోసపాటి మోహనరావు, గుజరాత్‌కు చెందిన ఆనంద్ కుమార్‌లు నగదు, బంగారాన్ని భారీస్థాయిలో కలిగి ఉన్నారన్నారు. వాటిని స్వాధీనం చేసుకొని ప్రశ్నించగా సరైన ఆధారాలు చూపలేక పోయారన్నారు. వీరిరువురు విజయవాడలోని శాంతి జ్యూవెలర్స్‌లో పని చేస్తున్నారని, బంగారు వస్తువులను వినుకొండలో అందజేసి నగదును తీసుకువెళ్తున్నట్టు తెలిపారన్నా రు. నిందితులను అరెస్టు చేశామని, స్వాధీనం చేసుకున్న బంగారాన్ని, నగదును సంబంధిత అధికారులకు అందజేయనున్నట్టు వారు తెలిపారు.

నడికుడి - గురజాల మధ్యన ఆర్‌యూబీ మూసివేత

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నడికుడి - గురజాల సెక్షన్ మధ్యన ఉన్న 87ఏ రోడ్డు అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ)ని 45 రోజుల పాటు మూసి వేయనున్నట్లు గుంటూరు రైల్వే డీఆర్ఎం ఎం రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి మార్చి 31వ తేదీ వరకు బ్రిడ్జి మూసివేసి ఉంటుందన్నారు. నడికుడి రైల్వేస్టేషన్‌లో కంటైనర్ ట్రాఫిక్ నిర్వహణ నిమిత్తం అదనపు లూప్‌లైన్ల నిర్మాణం కోసం ఆర్‌యూబీ 87ఏని పొడిగించాల్సి ఉందన్నారు. ఈ ఆర్‌యూబీ దాచేపల్లి-గోగులపాడు గ్రామాలను కలుపుతుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు దాచేపల్లి మీదగా మాచర్ల రహదారికి చేరుకోవచ్చని సూచించారు.

5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తాడికొండ, ఫిబ్రవరి 13: తాడికొండలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల సాంఘిక సంక్షేమ పాఠశాల(బాలుర)లో 5వ తరగతిలో చేరు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.మరియదాసు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 80 సీట్లు ఉన్నాయన్నారు. ఎస్సీ-60, బీసీ-సీ 10, ఎస్టీ-5, బీసీ-4, ఓసీ-1 సీట్లు ఉన్నట్లు తెలిపారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో నివసించేవారు ఈనెల 23వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9948138872 నెంబరులో సంప్రదించాలన్నారు.

గుంటూరు మిర్చియార్డులో ధరలు ఇలా...

గుంటూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,49,013 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 1,37,129 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డులో 1,01,807టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్టధర	గరిష్టధర	వెరైటీ	కనిష్టధర	గరిష్టధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			సూపర్ 10	13500	17300
334	8000	20500	నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
నెంబరు. 5	9000	20000	తేజ	8000	21500
273	13500	20500	బ్యాడిగి	10000	21000
341	10000	21500	దేవనూరుడీలక్స్	11000	20000
4884	13000	18000	తెల్లకాయలు	5500	12000

వైసీపీ ప్రచార సభగా ఆసరా చెక్కుల పంపిణీ



ఆసరా చెక్కు పంపిణీ సభలో మాట్లాడుతున్న గుంటూరు వైసీపీ ఎంపీ అభ్యర్థి ఉమ్మారెడ్డి వెంకటరమణ

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి13: ఆసరా చెక్కుల పంపిణీ ప్రభుత్వ కార్యక్రమాన్ని వైసీపీ ఎన్నికల ప్రచార సభగా మార్చడం పట్ల తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. పొన్నూరు పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో మంగళవారం వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ సభ నిర్వహించారు. ఈ వేదికపై స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యతోపాటు ఆయన బావమరిది వైసీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి ఉమారెడ్డి వెంకటరమణ, వైసీపీలో కీలక పదవుల్లో ఉన్న పలువురు నాయకులు ఆసీనులై ప్రసంగించారు. వెంకటరమణ మాట్లాడుతూ గుంటూరు ఎంపీగా తనను, పొన్నూరు ఎమ్మెల్యేగా తన బావమరిది కిలారి వెంకట రోశయ్యను గెలిపించాలని మహిళలకు విజ్ఞప్తి చేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఎన్నికల ప్రచార సభలా నిర్వహించారని మహిళలు మండిపడుతున్నారు. అధికారులు కూడా రాజకీయ పార్టీకి వత్తాసు పలికేలా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.


హత్యకేసులో 12మంది నిందితుల అరెస్టు



సమావేశంలో హత్య కేసుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

బాపట్లరూరల్, ఫిబ్రవరి 13: పాతకక్షల నేపథ్యంలోనే గోరంట్ల వెంకటసుమంత్ హత్య జరిగినట్లు బాపట్ల డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం బాపట్ల రూరల్ పోలీసుస్టేషన్‌లో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల ఆరోతేదీన సుమంత్‌పై వినోద్, యాసిన్ మరో 10 మంది కర్రలతో దాడి చేశారు. అనంతరం వినోద్ కత్తితో పొడిచాడు. దీంతో సుమంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి సుష్మాంజలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా 12మందిని అరెస్టు చేయటం జరిగిందన్నారు. ముద్దాయిలైన వినోద్, యాసిన్, సతీష్, అఖిల్, చిన్నవినోద్, ప్రవీణ్ బాబు, దాసు, శివసాయి, బాబు, మహేష్, అశోక్‌లను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచామని డీఎస్పీ తెలిపారు. అదేవిధంగా రౌడీషీటర్లపై నిఘా ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. బాపట్ల సబ్ డివిజన్ పరిధిలో ఉన్న పోలీసుస్టేషన్ పరిధిలో రానున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా డివిజన్ వ్యాప్తంగా 30యాక్ట్ పోలీసు అమలులో ఉందని తెలిపారు. సమావేశంలో ట్రైనీ డీఎస్పీ శ్రీవిద్య, బాపట్ల సర్కిల్ సీఐ హజరత్‌బాబు, బాపట్ల రూరల్ సీఐ శ్రీహరి, ఎస్ఐ రవి శంకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



శంకర్‌రెడ్డి మృతదేహం

మాచర్ల, ఫిబ్రవరి 13: విద్యుత్‌షాక్‌తో రైతు మృతిచెందిన ఘటన మాచర్ల పట్టణంలో జరిగింది. పట్టణంలోని రవి స్వీట్స్‌షాపు యజమాని శంకర్‌రెడ్డి (65) మంగళవారం పట్టణ శివారులోని రామప్ప ఆలయం వద్ద ఉన్న తన పొలానికి నీరుపెట్టేందుకు వెళ్లారు. మోటారు స్విచ్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్ తగిలి కుప్పకూలిపోయారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

దొరక్కుండా.. దాచేశారు..

● నిన్నటి వరకు యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
● ఎన్జీటీ ఆదేశాల మేరకు ఇసుక రీచ్‌లను పరిశీలించిన కలెక్టర్ శివశంకర్
● ముందస్తు సమాచారంతో క్వారీయింగ్ నిలిపివేత
● ఎక్స్‌కవేటర్లను దాచేశారు..
● ఇసుక అక్రమ క్వారీయింగ్ అడ్డుకోవాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం



మల్లాది రీచ్‌ని పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్

అమరావతి, అచ్చంపేట, ఫిబ్రవరి 13: ఎన్జీటీ ఆదేశాల మేరకు కలెక్టర్ శివశంకర్ లోతేటి మంగళవారం పెదకూరపాడు నియోజకవర్గంలోని మల్లాది, కోనూరు గ్రామాల్లో ఉన్న ఇసుకరీచ్‌లను మైనింగ్, పొల్యూషన్, రెవిన్యూ అధికారులతో కలసి పరిశీలించారు. నదీతీరం వెంబడి ఇసుక రీచ్‌లలో జరుగుతున్న ఇసుక అక్రమ క్వారీయింగ్, రవాణాకు సంబంధించి వివరాలను సేకరించి రిపోర్టు ఇవ్వాలని ఎన్జీటీ ఇచ్చిన ఆదేశాల మేరకు కలెక్టర్ రీచ్‌లను సందర్శించారు. కలెక్టర్ రీచ్‌ల పరిశీలనకు వచ్చిన సమయంలో ఇసుక అక్రమార్కులు ఎక్స్‌వేటర్‌లను సమీపంలోని పొలాల్లో దాచి క్వారీయింగ్‌ను నిలుపుదల చేశారు. మైనింగ్ అధికారి ఇసుక క్వారీయింగ్‌కు అనుమతులు లేవని ఎక్కడా ఇసుక అక్రమ రవాణా జరగడంలేదని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రీచ్‌లో ఇసుక వాహనాలు తిరిగినట్లు కనిపించడం, నిత్యం ఇసుకక్వారీయింగ్ జరుగుతుందని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో కలెక్టర్ స్పందించారు. మండల అధికారులు తమ పరిధిలో క్వారీయింగ్‌కు పాల్పడేవారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట మైనింగ్ ఏడీ నాగిణి, పొల్యూషన్ కంట్రోల్ అధికారితో పాటు ఆర్డీవో మురళీకృష్ణ, తహసీల్దార్ రమణారావు, ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో జి.రాణి, కుసుమకుమారి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు సమాచారంతో...

ఇసుక రీచ్‌లను పరిశీలించేందుకు జిల్లా అధికారులు వస్తున్న సమాచారం అక్రమార్కులకు తెలియడంతో మండలంలోని వైకుంఠపురం, మల్లాది గ్రామాల్లో జరుగుతున్న ఇసుక క్వారీయింగ్, అక్రమరవాణా మంగళవారం నుంచి నిలిచిపోయింది. నిత్యం వందలసంఖ్యలో భారీవాహనాల్లో ఇసుక తరలిస్తూ లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నా మండలస్థాయి అధికారులు అటువైపు కన్నెత్తికూడా చూడలేదు. దొంగబిల్లులతో ఇసుక ఓవర్‌లోడుతో వెళుతున్న వాహనాలపై పర్యవేక్షణ కూడా లేదు. అక్రమ క్వారీయింగ్ అడ్డుకుంటే అధికారపార్టీ నాయకుల నుంచి బెదిరింపులకు గురికావాల్సివస్తుందని మండల, గ్రామ స్థాయి అధికారులు అడ్డుకునేయత్నం చేయలేదని తెలుస్తోంది. హైకోర్టు అక్రమక్వారీయింగ్‌పై సీరియస్‌గా ఉండటంతో ఇప్పటికి జిల్లా అధికారులు కళ్లుతెరిచారని స్థానికులు అంటున్నారు.

ఇసుక అక్రమాలపై వైసీపీలోనే తిరుగుబాటు



పెదకొండూరులో రీచ్‌ని పరిశీలిస్తున్న తహసీల్దార్ కె.రవీంద్ర, ఎస్సై ప్రతాప్

దుగ్గిరాల, ఫిబ్రవరి13: గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలంలో ఇసుక అక్రమంగా తరలివెళుతుందంటూ వైసీపీ నాయకులే అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పెదకొండూరు రీచ్ నుంచి పెద్దఎత్తున్న అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారంటూ సాక్షాత్తూ జడ్పీటీసీ మేకతోటి అరుణకుమారి, గ్రామ ఎంపీటీసీ సుమన్‌తో కలిసి మంగళవారం స్థానిక తహసీల్దార్ కె.రవిబాబు, ఎస్ఐ సీహెచ్ ప్రతాప్‌లకు ఫిర్యాదు చేశారు. మైనింగ్ డీడీ దృష్టికి తీసుకెళ్లగా తమశాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేవని చెప్పారని జడ్పీటీసీ అరుణ అన్నారు. లారీల్లో భారీగా తరలిస్తున్నారని, రోడ్లుకూడా దెబ్బతిని పోతున్నాయని తక్షణమే చర్యలు తీసుకోకుంటే బుధవారం నుంచి గ్రామస్తులతో కలిసి అక్రమ క్వారీయింగ్‌ను అడ్డుకుంటామని హెచ్చరించారు. దీంతో తహసీల్దార్ రవిబాబు, ఎస్ఐతో కలిసి రీచ్‌వద్దకు వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. అక్రమ మైనింగ్‌పై సొంత పార్టీనేతలే ఫిర్యాదు చేయడం పట్ల జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

ఐఐటీ జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో విజ్ఞాన విద్యార్థుల ప్రభంజనం



విద్యార్థులతో శ్రీకూర్మనాథ్ తదితరులు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 13: ఐఐటీ జేఈఈ మెయిన్స్ పరీక్షలో విజ్ఞాన్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని విద్యాసంస్థల సమన్వయకర్త జి.శ్రీకూర్మనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఫలితాల్లో తమ కళాశాలకు చెందిన ఐ.హసీత్(99.67), ఎం.స్నేహ(99.46), రోహన్(98.48), కే లీలావతి (98.30), బీ యోగవిజయ్‌కుమార్(98.07), ఎస్.వెంకటగాయత్రి (96.32), ఏ దీపిక(95.78), టీ సంజయ్‌తేజ(94.71), పీ గౌతమ్(94.61), ఎం.నాగసాయి ప్రకాష్(93.66), వీ అభిరామ్(93.57), నాగ మానస(93.56), ఏ చంద్రిక(93.07), ఏ థాఫిల్ (93.50), జీ వైశాలి(92.76), సీ రేవంత్(92.11), జీ పుల్లారెడ్డి(92.05), వీ నందిని(91.60), వై.నాగకార్తికేయ(90.96) పర్సంటేజ్ సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులను విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, అధ్యాపకసిబ్బంది అభినందనలు తెలిపారు.

డీఏలను రికవరీ చేయడం చరిత్రలో తొలిసారి..

● వీఆర్ఏ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 13: చరిత్రలో తొలిసారిగా డీఏ రికవరీ పేరుతో వీఆర్ఏల నుంచి పెద్దఎత్తున వసూలుచేసిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు ఎద్దేవా చేశారు. మంగళవారం స్థానిక పాత గుంటూరులో సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆ సంఘ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 నుంచి 2024 జనవరి నాటికి ఒక్కో వీఆర్ఏ రూ.21,900 డీఏ రూపంలో కోల్పోయాడని వివరించారు. ఇన్ని ప్రభుత్వాలు మారినా వీఆర్ఏలను ఇంత దారుణంగా దెబ్బతీసిన ప్రభుత్వం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా వీఆర్ఏలందరిని మేల్కొల్పి పోరుబాట పట్టకపోతే వ్యవస్థకే నష్టంవచ్చే ప్రమాదం ఉందన్నారు. నామినీలను వీఆర్ఏలుగా గుర్తించడం, అర్హులైన వారందరికి పదోన్నతులు, ఇతర డిమాండ్ల సాధనకై ఈ నెల 18, 19, 20 తేదీలలో తలపెట్టిన రిలేదీక్షలలో వీఆర్ఏలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వై నేతాజీ, బి.లక్ష్మణరావు, షేక్ నాగులమీరా, రవీంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని..

● కన్న కూతుర్ని ప్రియుడితో కలిసి చంపిన తల్లి

తాడికొండ, ఫిబ్రవరి 13: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని తల్లి తన ప్రియుడితో కలిసి కన్న కూతుర్ని(6) కొట్టిచంపిన సంఘటన తాడికొండ మండలం బండారుపల్లి గ్రామంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కర్నూలు జిల్లా ఆలూరుకు చెందిన కొణతాల సిద్దార్థ హైదరాబాద్‌లో కూలీ పనుల చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. హైదరాబాద్‌లోని లాల్‌గూడకు చెందిన జనగాల స్వప్నకు సిద్దార్థతో పరిచయం ఏర్పడింది. స్వప్న ఓ బట్టల దుకాణంలో పనిచేస్తోంది. అమెకు భర్త, కుమార్తె(6) ఉన్నారు. సిద్దార్థ, స్వప్నల మధ్య కొంతకాలంగా వివాహేతర సంబంధం నడుస్తోంది. దీంతో ఇద్దరు కలిసి మూడు నెలల క్రితం హైదరాబాద్ నుంచి పారిపోయి అక్కడక్కడ తలదాచుకుంటున్నారు. 25 రోజుల క్రితం తాడికొండ మండలం బండారుపల్లి గ్రామానికి వచ్చారు. ఇదే గ్రామంలో గుడారం వేసుకుని మిరపకోత పనులకు వెళ్తున్నారు. ఈ క్రమంలో వారి వివాహేతర సంబంధానికి కుమార్తె అడ్డుగా ఉందని భావించి ఐదు రోజుల క్రితం చిన్నారిని కొట్టి చంపేశారు. పక్కనే ఉన్న రైల్వే ట్రాక్ వద్ద మృతదేహాన్ని పెట్రోల్ పోసి కాల్చివేశారు. అప్పటినుంచి ఇద్దరు పారిపోయారు. రైల్వేట్రాక్ వద్ద మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వటంతో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రభాకర్ పేర్కొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.36 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	138, 147,158
చికెన్ విత్ స్కిన్	264.00
చికెన్ స్కిన్ లెస్	274.00

బీసీల వ్యతిరేకి సీఎం జగన్ : ముప్పన

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 13 : రాజకీయంగా పల్నాడు ప్రాంతానికి చెందిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిని సీఎం జగన్ రాజకీయంగా బలిపశువును చేయడాన్ని వ్యతిరేకిస్తూ బీసీలంతా ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని రాష్ట్ర బీసీ కళామండలి అధ్యక్షుడు ముప్పన వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక బీసీ సంఘ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ అధ్యక్షుడు కొక్కెర కొండలు, పట్టణ అధ్యక్షుడు యడవల్లి కొండలు, ప్రధాన కార్యదర్శి దూదేకుల ఖాశింసైదా మాట్లాడుతూ ఐదేళ్లుగా రాజకీయ అవసరాలకు బీసీ సామాజికవర్గానికి చెందిన జంగా కృష్ణమూర్తిని వాడుకున్నారని, ఈ ఎన్నికల సమయంలో రాజకీయంగా దెబ్బకొట్టాలని చూస్తుండటా న్ని బీసీ సంఘ నేతలు ఉపేక్షించబోరన్నారు. ఈ కార్యక్రమంలో దూదేకుల సలీం, కుంచపు నాగలింగేశ్వరరావు, యరగాని వెంకట్, డాక్టర్ కెపి వెంకయ్య, నారబోయిన నరసింహారావు, అనంతుల శ్రీనివాసరావు, చింతల అజయ్‌కుమార్, దాసరి నాగరాజు, కర్పూరపు కోటేశ్వరరావు, చల్లగిరి మీడుగల ప్రసాద్, శ్రీకాంత్, దూదేకుల భాష, కంభంపాటి ముక్కంటి, డీకొండ కిరణ్ తదితరులున్నారు.

సాగర్‌డ్యాంను సందర్శించిన ఎన్‌డీఎస్‌ఏ బృందం


ప్రాజెక్ట్‌ను సందర్శిస్తున్న ఎన్‌డీఎస్‌ఏ బృందం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 13: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌ను మంగళవారం నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) బృందం సందర్శించింది. ప్రధాన డ్యాం, 420, 250 గ్యాలరీలతోపాటు స్పిల్‌వేను సందర్శించారు. అలాగే ప్రాజెక్ట్ గేట్లు, బకెట్ పోర్షన్ ప్రాంతాలను పరిశీలించారు. ముందుగా విజయవిహార్‌లో ఆంధ్ర, తెలంగాణ ఇంజనీర్లతోపాటు సీడబ్ల్యూసీ, కేఆర్‌ఎంబీ, సీఎస్ఆర్‌ఎంఎస్ సభ్యులతో సమావేశమయ్యారు. 2009లో వచ్చిన భారీ వరదల నుంచి డ్యాంను ఎలా కాపాడగలిగారనే దానిపై చర్చించారు. ఈ బృందంలో సీడబ్ల్యూసీ డైరెక్టర్ రమేష్‌కుమార్, స్టేట్ డ్యాం సేఫ్టీ ఆర్గనైజేషన్ సీఈ ప్రమీల, ఎస్ఈ శ్రీనివాస్, ఈఈ విజయలక్ష్మి, డీఈఈ సతీష్ తదితరులు ఉన్నారు. కాగా వీరు బుధవారం విద్యుత్ ఉత్పాదక కేంద్రంను సందర్శించనున్నారు.

ఘనంగా నిత్యసహాయమాత మహోత్సవాలు

మాచర్ల, ఫిబ్రవరి 13 : పట్టణంలో మంగళవారం నిత్యసహాయమాత మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఫాదర్ కొమ్మారెడ్డి లూర్థు మర్రెడ్డి సమిష్టి దివ్య బలిపూజ జరిపారు. సాయంత్రం క్రైస్తవులు ర్యాలీగా ఆలయానికి చేరుకొని ఒత్తులు సమర్పించారు. అనంతరం పురవీధుల్లో తేరు ప్రదిక్షణ గావించారు. కాగా సోమవారం రాత్రి నిర్వహించిన పాఠశాల స్థాయి నృత్య పోటీల్లో పట్టణంలోని ఓక్‌బ్రిడ్జి స్కూల్ విద్యార్థినులు ప్రతిభ చూపారు. విద్యార్థినులను స్కూల్ ఇన్‌చార్జి కూరపాటి శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు. విచారణ గురువులు కొమ్మారెడ్డి రఫేల్‌రెడ్డి, రత్నబాబు, జోసఫ్ బాలసాగర్, కన్నా అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్‌గా మేడగం

మాచవరం, ఫిబ్రవరి 13 : ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్‌గా మాచవరం మండలానికి చెందిన సీనియర్ నాయకుడు ఎంవీ రామిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నరసరావుపేటలో జరిగిన 77వ ఎస్టీయూ సంఘం వార్షిక కౌన్సిల్ సమావేశంలో రామిరెడ్డి ఎన్నికయ్యారు. మండలంలోని వేమవరం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

సభ్యుడిగా అనంతరామయ్య

దుర్గి, ఫిబ్రవరి 13: ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా దుర్గి జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు జీసీహెచ్ అనంతరామయ్య ఎన్నికయ్యారు.





సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, హాజరైన ముస్లిం మైనార్టీలు, టీడీపీ అభిమానులు

వైసీపీ హయాంలోనే మైనారిటీలపై దాడులు

- ఒక్కచాన్స్ పోయింది.. ఓటమి బటన్ నొక్కేందుకు సంసిద్ధం
- మైనారిటీల ఆత్మీయ సదస్సులో యరపతినేని

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 13 : ఐదేళ్లుగా రాష్ట్రంలో, నియోజకవర్గంలో మైనారిటీలపై దాడులు చేస్తున్న వైసీపీకి మరో చాన్స్ అడిగే హక్కు లేదని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. పిడుగురాళ్లలో మంగళవారం రాత్రి గురజాల నియోజకవర్గ స్థాయి మైనారిటీల ఆత్మీయ సమావేశంలో యరపతినేని మాట్లాడుతూ గురజాల నియోజకవర్గంలో పదేళ్ల చిన్నారుల నుంచి 80 ఏళ్ల వృద్ధుల వరకు ఏ ఒక్కరిని వదలకుండా మైనారిటీ సామాజిక వర్గీయులపై ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దాడులకు పాల్పడ్డాడని, తుమ్మలచెరువుకు చెందిన సైదాను తీవ్రంగా హింసించిన ఘటన ఏ ముస్లిం కుటుంబం మర్చిపోదన్నారు. అక్రమ మైనింగ్‌తో నలుగురు ముస్లిం చిన్నారులు చనిపోయారని, పిన్నెల్లి, తురకపాలెంలో ఎందరో ముస్లింలపై చేయనన్ని అఘాయిత్యాలకు వైసీపీ నేతలు పాల్పడ్డారన్నారు. ఇప్పుడు కూడా ర్యాలీగా వస్తుంటే పోలీసులు అడ్డుకున్నారని, ఇంకా భయపె ట్టాలని చూస్తే...అడ్డుకోవాలని చూస్తే....బెదిరిపోయే వారెవరూ లేరన్నా రు. నియోజకవర్గంలో ఐదు షాదీఖానాలు, మూడు మదర్సాలతో పాటు 120 మసీదుల నిర్మాణాలకు నిధులు అందించానని, అదేవిధంగా 50 లక్షల సొంత ఖర్చుతో పిడుగురాళ్లలో ఈద్గా నిర్మించిన విషయాన్ని గుర్తుచేశారు. ఎప్పటికైనా ముస్లిం మైనారిటీలకు తాను అండగానే వుంటానని, వారిపై వున్న ప్రేమ, ఆదరణతోనే 43 మందిని తన సొంత ఖర్చులతో హజ్‌యాత్రకు పంపించిన విషయాన్ని గుర్తు చేశారు. రేపటి ఎన్నికలలో ఖచ్చితంగా గెలుస్తాము....గెలిచాక నియోజ కవర్గం నుంచి వీలైనంత ఎక్కువ మందిని హజ్‌యాత్రకు పంపిస్తాన న్నారు. నియోజకవర్గానికి తాను తయారు చేసే మేనిఫెస్టోలో ముస్లిం మైనారిటీలకు ప్రాధాన్యత ఉంటుందని, టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రజాప్రభుత్వం రాబోతుందన్నారు. మైనారిటీల రక్షణకు చంద్రబాబు ప్రత్యేక రక్షణ కల్పిస్తారని, అదేవిధంగా గురజాలలో కూడా తాను అండగా వున్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర మైనారిటీ అధ్యక్షులు జనాబ్ మౌలానా ముస్తాక్ అహ్మద్, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి ఎండి నజీర్, పోలీస్ హౌసింగ్ బోర్డు మాజీ చైర్మన్ షేక్ నాగుల్‌మీరా, నెల్లూరు మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్, జనసేన రాష్ట్ర కార్యదర్శి నాయబ్ కమాల్‌లు మాట్లాడుతూ నారా హమారా.... యరపతినేని హమారా.....అని నినాదాలు ఇచ్చారు. 25 ఏళ్ల రాజకీయ అనుభవంలో అన్నివర్గాల ప్రేమాభిమానాలు పొందిన యరపతినేని గురజాలలో మైనారిటీలకు అండగా వుండటం ఏ ముస్లిం సోదరుడు మర్చిపోరన్నారు. చంద్రబాబుకు అత్యంత ఇష్టుడు, అత్యంత క్లిష్టపరి స్థితుల్లోనూ పల్నాడులో ఆత్మగౌరవ యాత్ర చేపట్టేలా యరపతినేని చేసిన సాహసం చంద్రబాబు ముగ్ధుడయ్యాడన్నారు. ఈ ఐదేళ్లలో గురజాల నియోజకవర్గంలో మైనారిటీలపై జరిగిన దాడులను వీడియో రూపంలో ప్రదర్శించారు. తొలుత ఎన్‌టీఆర్, అబ్దుల్ కలాం, లాల్‌జాన్‌భాష చిత్రపటాలకు నివాళులర్పించారు. సుమారు 4 వేలమందికిపైగా ముస్లిం మైనారిటీ నాయకులు ఆత్మీయ సదస్సుకు హాజరయ్యారు. ఈ సమావేశంలో షేక్ బాబావలి, సయ్యద్ అమీర్‌అలి, చింతపల్లి హసన్ అహ్మద్, షేక్ మస్తాన్‌వలి, షేక్ అహ్మదా, షేక్ ఖాశింసైదా, ఫరీద్‌మేస్త్రి, ఖాదర్‌వలి, షేక్ భాషా, ఇర్షాద్, ముజీబ్, దూదేకుల ఖాశింసైదా, చికెన్ జానీబాషా పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధాని అమరావతి : నరిచేటి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 13 : అమరావతి ఆంధ్రుల ఏకైక రాజధాని అని అమరావతి పరిరక్షణ సమితి జేఏసీ సత్తెనపల్లి నియోజకవర్గ కన్వీనర్ నరిచేటి వేణుగోపాల్ అన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మూడు రాజధానులు అనే ఆచరణ సాధ్యం కాని నినాదంతో ప్రజలను ఇంకా ప్రభుత్వం మభ్యపెడుతుందన్నారు. అమరావతి రాజధానిని ధ్వంసం చేశారని, భూములు ఇచ్చిన రైతులను వీధుల పాలు చేశారన్నారు. భౌతిక దాడులు, అక్రమ నిర్బంధాలు, కేసులు, దూషణలతో మానసికంగా, శారీరకంగా అమరావతి ఉద్యమకారులను వేధించారన్నారు. పాలకుల పాపం పండిందని, మరికొద్ది రోజుల్లోనే అమరావతి రాజధానికి భూములు ఇచ్చిన రైతులు, రైతు కూలీలకు మంచి రోజులు రాబోతున్నాయన్నారు.

బెదిరింపులు తగదు : టీడీపీ లీగల్ సెల్

సత్తెనపల్లి, ఫిబ్రవరి 13 : వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్న కార్యకర్తలను మంత్రి అంబటి రాంబాబు, వైసీపీ కార్యకర్తలు, వలంటీర్లు వేధింపులకు గురి చేయటం తగదని టీడీపీ లీగల్ సెల్ నేతలు అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ టీడీపీకి ప్రజల నుంచి ఆదరణ పెరుగుతుండటంతో ఇటీవల వైసీపీ నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారన్నారు. టీడీపీ పార్టీ సిద్ధాంతాలు నచ్చి కన్నా లక్ష్మీనారాయణ మీద నమ్మకంతో పార్టీలో చేరుతున్న వారిని వార్డు వలంటీర్ల ద్వారా బెదిరించటం తగదన్నారు. పద్ధతులు మార్చుకోకపోతే తగిన విధంగా గుణపాఠం చెబుతామని నేతలు బత్తుల ఆదినారాయణ, బొక్కా సంగీతరావు, దివ్వెల శ్రీనివాసరావులు అన్నారు. బెదిరింపుల పై పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

సీజీజీబీలో మాయమైన బంగారాన్ని ఇప్పించాలి

క్రోసూరు, ఫిబ్రవరి 13 : క్రోసూరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్‌లో మాయమైన బంగారాన్ని వెంటనే ఖాతాదారులకు ఇప్పించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని, బ్యాంక్ లావాదేవీలను స్తంభింపజేస్తామని పలు రైతు సంఘాల నాయకులు, ఖాతాదారులు హెచ్చరించారు. బ్యాంక్ ఎదుట మంగళవారం ఆందోళన నిర్వహించారు.

నూతన బోర్లకు రూ.10 లక్షలు విడుదల

రెంటచింతల, ఫిబ్రవరి 13 : మేజర్ పంచాయతీ రెంటచింతలలో నెలకొన్న తాగునీటి ఎద్దడి నివారణకు నూతనంగా బోర్లు వేయడానికి, ఉన్న బోర్లకు మరమ్మతులు చేసే నిమిత్తం రూ.10 లక్షలు విడుదలైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కొత్త నరేంద్రారెడ్డి చెప్పారు. 15వ ఆర్థిక సంఘం ద్వారా ఈ నిధులు విడుదలయ్యాయన్నారు. 10 నూతన మోటార్లను కూడా అమర్చుతామన్నారు.

టిప్పర్ ఢీకొని వృద్ధురాలు మృతి

గురజాలటౌన్, ఫిబ్రవరి 13: టిప్పర్ ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన గురజాలలో జరిగింది. పట్టణంలోని దివ్యాంగుల కాలనీ చెందిన దేవండ్ల రాములమ్మ (64) నగరపంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలో తన మరిది మరణించడంతో అక్కడకు వెళ్లేందుకు బయలుదేరింది. బస్టాండ్ వద్దకు రాగా వెనుకగా వచ్చిన టిప్పర్ ఆమెను ఢీకొంది. ఆమె కిందపడిపోగా ఆమెపై నుంచి టిప్పర్ వెళ్లింది. ఈ సంఘటనలో వృద్ధురాలు అక్కడికక్కడే మృతిచెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందాలు ఆడుతున్న వ్యక్తులు అరెస్టు

మాచర్ల, ఫిబ్రవరి 13 : మండలంలోని జమ్మలమడక శివారులో మంగళవారం కోడి పందాలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో రూరల్ పోలీసులు అక్కడకు చేరుకున్నారు. కోడి పందాలు ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.11,960తోపాటు కోడిని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ కుర్రి రాజశేఖర్ తెలిపారు.

నేడు టీడీపీ కార్యాలయం ప్రారంభం

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 13 : పట్టణంలోని నెహ్రూనగర్ మెయిన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన టీడీపీ కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించనున్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. కార్యాలయ ప్రారంభం అనంతరం యెనుముల కేశవరెడ్డి ఆధ్వర్యాన పార్టీలో భారీగా చేరికలు జరగనున్నాయి. భారీ బైకు ర్యాలీ నిర్వహించనున్నారు.

నేడు మహాశివరాత్రి సమీక్షా సమావేశం

అమరావతి, ఫిబ్రవరి 13: మార్చి 8 మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో తొలి సమీక్షా సమావేశం బుధ వారం సాయంత్రం 3గంటలకు ఆలయ ప్రాంగణంలో జరుగు తుందని ఆర్డీవో మురళీకృష్ణ తెలిపారు. ఉత్సవ ఏర్పాట్లపై తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించేందుకు సంబంధిత అధికారులు హాజరుకావాలని కోరారు.

సంగం డెయిరీ కుటుంబ సభ్యుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు

పెదకూరపాడు, ఫిబ్రవరి 13 : సంగం డెయిరీలో పాలు పోసే సభ్యుల పిల్లలకు విద్య కోసం స్కాలర్‌షిప్‌లు, పాడి గేదెల లోన్‌లు, బోనస్‌లు, ఇన్సూరెన్స్ సదుపాయం కల్పిస్తుందని పశు వైద్యాధికారి డాక్టర్ ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని లగడపాడులో సంగం డెయిరీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గేదెలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు బత్తుల కోటేశ్వరరావు, డాక్టర్ ప్రతాప్, సూపర్‌వైజర్ కోటేశ్వరరావు, ఎంపీటీసీ హసన్‌వలి, అల్లాభక్షు, సాంబ శివరావు, ఇబ్రాయేలు ఉన్నారు.

మెడికల్ కళాశాల పనుల పరిశీలన

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 13: బ్రాహ్మణపల్లి సమీపంలోని మెడికల్ కళాశాల పనులను మంగళవారం ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పరిశీలించారు. మొదటి ఫేజ్ కింద మరో పదిరోజుల్లో ఆసుపత్రిలో 100 పడకలను ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే కాసు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి : సీపీఐ

దాచేపల్లి, ఫిబ్రవరి 13 : కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన గ్రామీణ బంద్ పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ నాయకులు మంగళవారం కోరారు. దాచేపల్లి సీపీఐ కార్యాలయంలో నాయకుడు వేముల వెంకటరెడ్డి మాట్లాడారు. ఎం.రమణారెడ్డి, టి.వెంకట నాగరాజు తదితరులున్నారు.


టీడీపీలో చేరిన వారితో కన్నా లక్ష్మీనారాయణ తదితరులు

20 కుటుంబాలు టీడీపీలో చేరిక

సత్తెనపల్లి, ఫిబ్రవరి 13 : పట్టణంలోని 22వ వార్డులో టీడీపీ ఇన్‌చార్జ్ మల్లాల నరసయ్య ఆధ్వర్యంలో 20 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. వారికి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు ఇస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎలినేడి రామస్వామి, ఆతుకూరి నాగేశ్వరరావు, నూర్ బాషా జానీ బాబు, రాంబో బుడే, దూద్‌కే ముస్తఫా, పల్లపాటి సైదయ్య, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏపీజేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 13 : ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 14వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఉద్యమాలు చేయనున్నట్టు ఏపీజేఏసీ సత్తెనపల్లి ఏరియా చైర్మన్ పెండెం మణిరావు తెలిపారు. ఎన్జీవో హోంలో మంగళవారం సాయంత్రం సత్తెనపల్లి జేఏసీ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న నేతలు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ 14వ తేదీ విధులకు నల్ల బ్యాడ్జీలతో హాజరై తహసీల్దార్, ఆర్డీవోకు మెమోరాండం సమర్పించటం జరుగుతుందన్నా రు. 15, 16 తేదీల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి మధ్యాహ్న భోజన సమయంలో నిరసన, 17న తాలూకా స్థాయిలో ర్యాలీ, ధర్నా, 20న జిల్లా కేంద్రంలో ర్యాలీ, ధర్నా, 21 నుంచి 24వ తేదీ వరకు ఉద్యమ కార్యాచరణ ఉధృతం చేయటం జరుగుతుందన్నా రు. 27న ఛలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సందేపోగు అంబేద్కర్, ఇబ్రహీం, రెహ్మాన్, ప్రేమ్ కుమార్, రమేష్‌బాబు, రామారావు, ఎస్ఎం సుభాని పాల్గొన్నారు.

చెంబులింగేశ్వర స్వామి వారికి కొమ్మాలపాటి విరాళం

బెల్లంకొండ, ఫిబ్రవరి 13 : మండలంలోని చంద్రాజుపాలెంలో ఉన్న శ్రీ చంబులింగేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నదాన కార్యక్రమానికి మంగళవారం రూ.1.20 లక్షల విరాళం ఇచ్చినట్టు రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ తెలిపారు. చంబులింగేశ్వర స్వామి ఆలయం వద్దకు వెళ్ళి నగదును అందజేసినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, బెల్లంకొండ సర్పంచ్ గడ్డిపర్తి జ్యోతి సముద్రం, బీసీ సెల్ మండల అధ్యక్షుడు గుంజా గంగారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు రాంబాబు, వాణిజ్య విభాగ అధ్యక్షుడు అన్నా వెంకటరెడ్డి, తీగ వెంకయ్య, చెరుకుపల్లి శ్రీను, ముద్దా మంగయ్య, గోపయ్య, శివ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి : ఏపూరి

నకరికల్లు, ఫిబ్రవరి 13 : కార్మికులకు కనీస వేతనం చట్టం అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకొని అమలు చేయాలని రైతు కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నకరికల్లులోని భగత్‌సింగ్ సీపీఎం కార్యాలయంలో మంగళవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అనంతరం సీఐటీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గోదా చిన్న, పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, గాదె కుమారి, జీ పిచ్చారావు, ఎం జాన్ అహమ్మద్, గోదా బాల, షేక్ సైదా తదితరులు పాల్గొన్నారు.

బంద్‌ను జయప్రదం చేయాలి : గుంటుపల్లి

ముప్పాళ్ళ ఫిబ్రవరి 13 : బీజేపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వ్యవసాయ, కార్మికరంగాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తుందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పశ్చిమ జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి బాలకృష్ణ అన్నారు. ముప్పాళ్ళలో ప్రజా సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం మంగళవారం జరిగింది.



లెటర్ సిరీస్

పార్ట్-3

1. L - NMMN - NNL - L - MN -
(ఎ) MLLMM (బి) MLMLM
(సి) LLMMM (డి) ఏదీకాదు
సమాధానం: (బి)
వివరణ: ఆప్షన్ (బి)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.
LMNM / MNLN / NLML / LMNM
ప్రతి సమూహంలోను మొదటి మూడు అక్షరాలు LMN / MNL /NLM / LMN కింది పద్ధతిని అనుసరించాయి. మొదటి సమూహంలో చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మొదటి సమూహంలో మొదటి అక్షరం రెండో సమూహంలో చివరి అక్షరంగా ఏర్పడింది. అదే విధంగా రెండో సమూహంలోని చివరి రెండు అక్షరాలు మూడో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, రెండో సమూహంలోని మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఏర్పడింది. ఈ విధంగా ఒక కచ్చితమైన చైన్ పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది. అంతేకాక ప్రతి సమూహంలో రెండో అక్షరమే తిరిగి నాలుగో అక్షరంగా రిపీట్ అయింది.
∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు MLMLM

2. a - bcb - cac - a - aa - c
(ఎ) abcbb (బి) abbcb
(సి) abbbc (డి) ఏదీకాదు
సమాధానం: (ఎ)
వివరణ: ఆప్షన్ (ఎ)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.
aabc / bbca / ccab /aabc
ప్రతి సమూహంలోను చివరి మూడు అక్షరాలు అయిన abc / bca / cab / abc కింది పద్ధతిని అనుసరించాయి. మొదటి సమూహంలో చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మొదటి సమూహంలో మొదటి అక్షరం రెండో సమూహంలో చివరి అక్షరంగా ఏర్పడింది. అదేవిధంగా రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలు మూడో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, రెండో సమూహంలోని మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఏర్పడింది. ఈవిధంగా ఒక కచ్చితమైన పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది. అంతేకాక మొదటి సమూహంలో మొదటి అక్షరంగా a, రెండో సమూహంలో మొదటి అక్షరంగా b, మూడో సమూహంలో మొదటి అక్షరంగా 'c' ఉంది.
∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు abcbb

3. a - ab - ab - b - b - b -
(ఎ) bbabbb (బి) bbbbba
(సి) bbbabb (డి) ఏదీకాదు
సమాధానం: (సి)
వివరణ: ఆప్షన్ (సి)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.
ab / abb / abbb / abbbb
రెండో సమూహం నుంచి ప్రతి సమూహంలోను దానిముందు సమూహంలోని అక్షరాలే ఉంటూ ఒక 'b' అదనంగా చేరింది.
∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు bbbabb

4. L - N - LM - ML - N - LM - L
(ఎ) MMNNNN (బి) MLNMNN
(సి) MNMNMN (డి) ఏదీకాదు
సమాధానం: (బి)


పోటీ పరీక్షల ప్రత్యేకం
రీజనింగ్

వివరణ: ఆప్షన్ (బి)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.
LMNL / LMNM / LMNN / LMNL
ప్రతి సమూహంలోను మొదటి మూడు అక్షరాలుగా LMN ఉంటూ, నాలుగో అక్షరంగా మొదటి సమూహంలో L, రెండో సమూహంలో M, మూడో సమూహంలో N ఉన్నాయి. ఈ విధంగా ఒక కచ్చితమైన పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.
∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు MLNMNN

5. P - QQ - RRR - P - Q
(ఎ) PPPQ (బి) PQPP (సి) PPQP
(డి) ఏదీకాదు **సమాధానం:** (బి)
వివరణ: ఆప్షన్ (బి)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.
PPQ / QQR/ RRP / PPQ
ప్రతి సమూహంలోను మొదటి రెండు అక్షరాలు సేమ్. ∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు PQPP

6. P - P - PP - PP - P - P - PP
(ఎ) QPQPQP (బి) PQPQPQ
(సి) PPPQQQ (డి) ఏదీకాదు
సమాధానం: (ఎ)
వివరణ: ఆప్షన్ (ఎ)లోని అక్షరాలను ఇచ్చిన

దిక్సూచి
DIKSUCHI

ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.
PQPP / PPQP/ PPPQ / PPPP
మొదటి సమూహంలో ఒక P తరవాత Q, రెండో సమూహంలో రెండు Pలు తదుపరి Q, మూడో సమూహంలో మూడు Pలు తదుపరి Q ఉంటూ నాలుగో సమూహంలో నాలుగు Pలతో ఈ సిరీస్ పూర్తి అయింది.
∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు QPQPQP

7. a - cca - b - aab -
(ఎ) bcbc (బి) bbcc (సి) cbcb
(డి) ఏదీకాదు **సమాధానం:** (బి)
వివరణ: ఆప్షన్ (బి)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.
abc / cab / bca / abc
మొదటి సమూహంలో చివరి అక్షరం రెండో సమూహంలో మొదటి అక్షరంగా మొదటి సమూహంలో మొదటి రెండు అక్షరాలు రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలుగా ఏర్పడ్డాయి. అదే విధంగా రెండో సమూహంలోని చివరి అక్షరం మూడో సమూహంలో మొదటి అక్షరంగా, రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలు మూడో సమూహంలో చివరి రెండు అక్షరాలుగా ఏర్పడ్డాయి. ఈవిధంగా ఒక కచ్చితమైన చైన్ పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.
∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు bbcc

8. a - bc - ab - cdabc - dab - d -
(ఎ) adbccd (బి) abcddc
(సి) abcdcd (డి) ఏదీకాదు
సమాధానం: (ఎ)
వివరణ: ఆప్షన్ (ఎ)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.
aabcd / abbcd abccd /abcdd
ప్రతి సమూహంలోను abcd అనే నాలుగు అక్షరాలు ఉంటూ మొదటి సమూహంలో a స్థానంలో రెండు aలు రెండో సమూహంలో b స్థానంలో రెండు bలు మూడో సమూహంలో c స్థానంలో మూడు cలు, నాలుగో సమూహంలో d స్థానంలో రెండు dలు ఉన్నాయి. ఈవిధంగా ఒక కచ్చితమైన పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.
∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు adbccd


డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

జాతీయ చలనచిత్ర అవార్డుల్లో కీలక మార్పులు

ప్రతిభ ప్రదర్శించిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు, ఉత్తమ విలువలు కలిగిన చిత్రాలను ఎంపిక చేసి ప్రతి ఏటా ఇచ్చే జాతీయ చలనచిత్ర అవార్డుల్లో కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఇప్పటి వరకూ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పేరు మీద ఇచ్చే 'ఉత్తమ తొలి చిత్ర దర్శకుడు' అవార్డ్‌ను ఇకపై ఆ పేరుతో కాకుండా 'ఉత్తమ తొలి చిత్ర దర్శకుడు' పేరుతో ఇస్తారు. అంటే అందులో ఉన్న 'ఇందిరాగాంధీ' పేరు తొలిగించారన్న మాట. ఈ విభాగంలో దర్శకుడితో పాటు నిర్మాతకు కూడా ప్రైజ్ మనీ ఇచ్చేవారు. ఇకపై దర్శకుడికి మాత్రమే ప్రైజ్ మనీ ఇస్తారు. అలాగే బాలీవుడ్ నటి నర్గిస్ పేరు మీద జాతీయ సమైక్యతను పెంపొందించే చిత్రానికి ఓ అవార్డ్ ఇస్తున్నారు. ఇకపై ఆ అవార్డులో నర్గిస్ పేరు కూడా ఉండదు. 'జాతీయ, సామాజిక, పర్యావరణ విలువలు పెంపొందించే ఉత్తమ చిత్రం' పేరుతో ఆ అవార్డ్ అందజేస్తారు. కేంద్ర సమాచార శాఖ అదనపు కార్యదర్శి నీర్జా శేఖర్ నేతృత్వంలోని కమిటీ సమావేశమై జాతీయ చలనచిత్ర అవార్డులలో కీలక మార్పులు చేస్తూ ఏకగ్రీవ నిర్ణయం తీసుకుంది. ఈ కమిటీలో కేంద్ర ప్రభుత్వ అధికారులతో పాటు సెన్సార్ బోర్డ్ చైర్మన్ ప్రసూన్ జోషి, సినీ ప్రముఖులు ప్రియదర్శన్, విపుల్ షా, ఛాయాగ్రాహకుడు నల్లముత్తు కూడా ఉన్నారు. జాతీయ చలనచిత్ర అవార్డులు 2022 కోసం ఎంట్రీలు స్వీకరించడానికి జనవరి 30తో గడువు ముగియడంతో ఈ కమిటీ సమావేశమై పలు కొత్త నిర్ణయాలు తీసుకుంది. ఈ విషయాన్ని కమిటీ సభ్యుడైన దర్శకుడు ప్రియదర్శన్ ధ్రువీకరించారు. 'నేను కూడా కొన్ని సూచనలు చేశాను. సౌండ్ విభాగానికి కూడా అవార్డులు ఇవ్వాలన్నది వాటిలో ఒకటి' అని ఆయన వెల్లడించారు.

మార్పులు ఇవే

● చలనచిత్ర పరిశ్రమకు ఇతోధిక సేవలు అందించిన చలనచిత్ర ప్రముఖులకు ఇచ్చే దాదాసాహెబ్ ఫాల్కే అవార్డ్‌కు ఇంతవరకూ రూ పది లక్షలు నగదు ఇస్తున్నారు. ఆ మొత్తాన్ని ఇప్పుడు రూ 15 లక్షలకు పెంచారు.



● స్వర్ణకమలం అవార్డ్ పొందిన వారికి ఇకపై రూ. మూడు లక్షలు, రజిత కమలం పొందిన వారికి రూ రెండు లక్షలు అందజేస్తారు. ఉత్తమ చిత్రం, ఉత్తమ తొలి చిత్రం, పూర్తి వినోదాత్మక చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ బాలల చిత్రం .. విభాగాలకు స్వర్ణ కమలం అందిస్తారు. ఇక మిగిలిన అన్ని విభాగాలు.. అంటే ఉత్తమ ప్రబోధాత్మక చిత్రం, నటనా విభాగంలో వచ్చే అవార్డులు, ఉత్తమ స్ర్కీన్‌ప్లే, ఉత్తమ సంగీత దర్శకుడు.. ఇలాంటి అన్ని అవార్డులకు రజిత కమలం అందిస్తారు.

● ఇప్పటివరకూ బెస్ట్ ఏనిమేషన్ ఫిల్మ్, 'బెస్ట్ స్పెషల్ ఎఫెక్ట్ ఫిల్మ్' అంటూ విడివిడిగా అవార్డులు ఇస్తున్నారు. ఇకపై ఈ రెంటినీ కలిపేసి 'బెస్ట్ ఎవిజీసీ'(యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్) పేరుతో అవార్డులు ఇస్తారు.

● బెస్ట్ ఆడియోగ్రఫీ విభాగంలో మూడు సబ్ కేటగిరిలు ఉన్నాయి. 'సౌండ్ రికార్డిస్ట్', 'సౌండ్ డిజైనర్', 'ఫైనల్ మిక్స్‌డ్ ట్రాక్ రికార్డిస్ట్' అని. ఇకపై ఇవన్నీ కలిపి 'బెస్ట్ సౌండ్ డిజైనర్' పేరుతో అవార్డ్ ఇస్తారు. ప్రైజ్ మనీని కూడా యాభై వేల నుంచి రెండు లక్షల రూపాయలకు పెంచారు.

● ఉత్తమ సంగీత దర్శకుడు పేరుతో ఇచ్చే అవార్డ్‌ను ఇకపై 'ఉత్తమ నేపథ్య సంగీతం' పేరుతో ఇవ్వనున్నారు.

● ప్రత్యేక జ్యూరీ అవార్డ్‌ను తొలగించి ఆ స్థానంలో ఫీచర్ ఫిల్మ్‌కు ఒక అవార్డ్, నాన్ ఫీచర్ ఫిల్మ్‌కు ఒక అవార్డ్ ను ఇచ్చే అధికారాన్ని జ్యూరీకి ఇచ్చారు


● నాన్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో ఇచ్చే కొన్ని అవార్డులు తొలిగించారు. మరికొన్ని కలిపేశారు. 'బెస్ట్ స్ర్కిప్ట్' పేరుతో కొత్తగా ఒక అవార్డును ఏర్పాటు చేశారు.

హ్యాట్రిక్ సాధిస్తామనే నమ్మకం ఉంది


రాజేశ్ దండా

సందీప్ కిషన్, నేను, దర్శకుడు ఆనంద్ స్నేహితులం. హాస్య మూవీస్ సంస్థను ప్రారంభించి తీయాలనుకున్న మొదటి సినిమా 'ఊరు పేరు భైరవకోన'. సందీప్ కిషన్ కెరీర్‌లోనే హయ్యెస్ట్ బడ్జెట్ చిత్రం ఇది. బిజినెస్ కూడా అదే స్థాయిలో జరిగింది. అందుకే విడుదలకు ముందే హ్యాపీగా ఉన్నాం' అన్నారు నిర్మాత రాజేశ్ దండా. సందీప్ కిషన్ హీరోగా ఆయన నిర్మించిన 'ఊరు పేరు భైరవకోన' చిత్రం ఈ నెల 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం మీడియాతో చిత్ర విశేషాలు పంచుకొన్నారు. నచ్చిన కథలు చేసుకుంటూ వెళుతున్నామని చెబుతూ 'మా సంస్థ సక్సెస్ ట్రాక్‌ను 'ఊరు పేరు భైరవకోన' కొనసాగించి హ్యాట్రిక్ అందిస్తుందనే నమ్మకం ఉంది. ప్రీమియర్ షోలన్నీ ఫుల్ కావడం ఈ సినిమాపై ఉన్న క్రేజ్‌కు అద్దం పడుతుంది' అని ఆయన చెప్పారు. చిత్రంలోని అంశాల గురించి వివరిస్తూ 'ఇదొక ఫాంటసీ థ్రిల్లర్. 'భైరవకోన' అనే ఊరులో ఎవరూ ఊహించని సంఘటనలు జరుగుతుంటాయి. అలాగే గరుడ పురాణం పుస్తకంలో మిస్ అయిన పేజీలకు, ఈ కథకు ఉన్న లింక్ కూడా ఆసక్తికరంగా ఉంటుంది. చిత్రంలో 47 నిముషాల అద్భుతమైన సీజీ వర్క్ ఉంది. ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతినిచ్చే సినిమా ఇది' అని రాజేశ్ చెప్పారు.

పాచికల ఆట నేపథ్యం



రాహుల్ సదాశివన్ దర్శకత్వంలో వైనాట్ స్టూడియో నిర్మించిన చిత్రం 'భ్రమయుగం'. మమ్ముట్టి కథానాయకుడు. పాచికల ఆట నేపథ్యంలో అనుక్షణం ఉత్కంఠ కలిగించే విధంగా చిత్రం ఉంటుందని దర్శకనిర్మాతలు చెబుతున్నారు. ఓ గాయకుడి జీవితంలో జరిగిన అనూహ్య సంఘటనల నేపథ్యంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. మొదట మలయాళంలో మాత్రమే విడుదల చేసి, ఆ తర్వాత మిగిలిన భాషల్లో రిలీజ్ చేయాలని నిర్మాణ సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. 'భ్రమయుగం' చిత్రానికి సినిమాటోగ్రఫీ: షెహనాద్ జలాల్, సంగీతం: క్రిస్టో జేవియర్, మాటలు: టి.డి. రామకృష్ణన్, నిర్మాతలు: చక్రవర్తి రామచంద్ర, ఎస్.శశికాంత్.

స్నేహ గీతం

ఇంద్ర, కోమల్ నాయర్, దీప్తి, స్వాతి శర్మ ప్రధాన తారాగణంగా స్నేహం గొప్పతనాన్ని తెలిపే కథాంశంతో రూపొందిన చిత్రం 'ట్రెండ్ మారినా ఫ్రెండ్ మారడు'. లక్ష్మణ్ జెల్ల దర్శకత్వంలో చంద్ర ఎస్ చంద్ర, డాక్టర్ విజయ రమేశ్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం నుంచి 'నా కల' అంటూ సాగే గీతాన్ని సంగీత దర్శకుడు ఘంటాడి కృష్ణ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'చిత్రీకరణ దాదాపు పూర్తయింది. కొత్త, పాత నటుల కాంబినేషన్‌లో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం' అన్నారు. గాయని సునీత ఆలపించిన ఈ గీతం ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకుడు అన్నారు. ఇందులో తన పాత్ర సరికొత్తగా ఉండబోతోందని ఇంద్ర చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రావణ్ భరద్వాజ. సినిమాటోగ్రఫీ: రాహుల్ మాచినేని





సామాజిక బాధ్యతతో సినిమా తీశాం

వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన చిత్రం 'రాజధాని ఫైల్స్'. అఖిలన్, వీణ, వినోద్‌కుమార్, వాణీ విశ్వనాథ్ కీలక పాత్రలు పోషించారు. భాను దర్శకత్వంలో కంఠంనేని రవిశంకర్ నిర్మించారు. ఈ నెల 15న చిత్రం విడుదలవుతున్న సందర్భంగా మేకర్స్ ప్రీ రిలీజ్ ఫంక్షన్ నిర్వహించారు. ఇందులో నిర్మాత మాట్లాడుతూ రైతులు స్వచ్ఛందంగా ఇన్ని వేల ఎకరాల భూములు ఇస్తే దానిని ఎగతాళి చేస్తూ, వారిని మానసిక క్షోభకు గురి చేసిన సంఘటనలు ఈ మధ్య కాలంలో చోటు చేసుకున్నాయి. దానిని స్ఫూర్తిగా తీసుకుని రైతుల పక్షాన ఒక సినిమా తీయాలని అనుకున్నాం. అయితే ఈ సినిమా ఏ పార్టీకి వ్యతిరేకం కాదు. రైతుల కన్నీళ్లు తుడిచే విధంగా సమాజాన్ని చైతన్యపరుస్తూ ఓ సామాజిక బాధ్యతతో ఈ సినిమా నిర్మించాం.. దర్శకుడు భాను అద్భుతంగా తీశారు. సినిమాకు అఖండ విజయం అందించి రైతులకు సంఘీభావం తెలియజేయాలి' అని కోరారు. ఇందులో తను రైతు పాత్ర పోషించాననీ, ఇది పొలిటికల్ ఫిల్మ్ కాదనీ, రైతుల ఆవేదనని తెలియజేసే కథ అని వినోద్‌కుమార్ చెప్పారు. ఈ సినిమాలో తను భాగం అయినందుకు ఆనందంగా ఉందని వాణీ విశ్వనాథ్ చెప్పారు. ఏడు వందల మంది రైతులతో ఈ సినిమా తీశామని దర్శకుడు భాను చెప్పారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులు, మహిళలు ఇందులో నటించారని తెలిపారు. అందరికీ ఉపయోగపడే సినిమా ఇదన్నారు.

శివనాగిని సిద్ధం



సురేశ్, మమతా రాహుత్ హీరో హీరోయిన్లుగా రూపొందుతున్న చిత్రం 'శివనాగిని'. సుమన్, షాయాజీషిండే, అజయ్ ఘోష్ కీలకపాత్రలు పోషించారు. మొండెం శ్రీధర్ దర్శకత్వంలో చదలవాడ హరిబాబు నిర్మించారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేసి సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "శివనాగిని'లో 30 నిమిషాల గ్రాఫిక్ సీక్వెన్స్ ఉంది. మారేడుమల్లి అడవుల్లో అద్భుతమైన లోకేషన్లలో చిత్రీకరణ చేశాం. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: జాన్ పోట్ల. సినిమాటోగ్రఫీ: యామేష్

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/9ZVu7hY లో చదవండి.

SCHOLARSHIP ALERT

Bhalodia-Khetan Summer Research Excellence Award

Description: Bhalodia-Khetan Summer Research Excellence Award 2024 is an opportunity offered by the Indian Institute of Technology, Gandhinagar to honor and recognise outstanding research conducted by students participating in the Summer Research Internship Program (SRIP) at IIT Gandhinagar.
Eligibility: Open for students who have completed the Summer Research Internship Programme (SRIP) under the faculty guides' evaluation at the Indian Institute of Technology (IIT), Gandhinagar.
Prizes & Rewards: An award of 50,000 (one-time)
Last Date to Apply: 05-03-2024
Application mode: Online Applications Only
Short Url: www.b4s.in/aj/BKSA1

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/pNikVWtలో చదవండి.

National AIDS Control Organisation Internship Programme



Description: National AIDS Control Organisation (NACO) Internship Programme 2024 is an opportunity offered by the Ministry of Health & Family Welfare, Government of India for students pursuing undergraduate, postgraduate, M.Phil and Ph.D. degree courses in various disciplines.
Eligibility: Open for Indian nationals pursuing undergraduate, postgraduate, M.Phil, and Ph.D. degree courses in specified disciplines.
Prizes & Rewards: A monthly stipend of 8,000 and a completion certificate
Last Date to Apply: Round The Year
Application mode: via post or email at: Deputy Secretary National AIDS Control Organisation (NACO) 9th Floor, Chandralok Building, 36, Janpath, New Delhi – 110001 Email ID: naco.internship@gmail.com
Short Url: www.b4s.in/aj/NACO1

Summer Research Internship Program (SRIP)

Description: Summer Research Internship Program (SRIP) 2024 is a research opportunity offered by the Indian Institute of Technology, Gandhinagar, to students pursuing bachelor's or master's degrees at institutions in India.
Eligibility: Open for Indian nationals pursuing a bachelor's or master's degree at an Indian institution.
Prizes & Rewards: A weekly stipend of 2,000 and other benefits.
Last Date to Apply: 05-03-2024
Application mode: Online Only
Short Url: www.b4s.in/aj/SRIP2

buddy4study.com

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



అర్జీదారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఏ శ్యామ్‌ప్రసాద్ తదితరులు

స్పందనలో 75 ఫిర్యాదులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 13: పల్నాడు జిల్లా నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలోని డాక్టర బీఆర్ అంబేద్కర్ స్పందన హాలులో జగనన్నకు చెబుదాం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఏ శ్యామ్‌ప్రసాద్, డీఆర్వో కే వినాయకం, ఐసీడీఎస్ పీడీ ఉమారాణి, డిప్యూటీ కలెక్టర్ అజయ్‌కుమార్ తదితరులు ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. స్పందనలో 75మంది అర్జీలను అధికారులకు అందజేశారు. అందిన అర్జీలను సంబంధిత శాఖలకు అందజేస్తూ త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులకు రెడ్‌క్రాస్ సొసైటీ భోజన వసతి ఏర్పాటుచేశారు.

హోంగార్డుల కుటుంబాలకు ఆర్థిక సాయం

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 13: ఉమ్మడి గుంటూరు జిల్లాలో హోంగార్డుగా సేవలు అందిస్తూ మృతిచెందిన, స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన హోంగార్డులకు తోటి హోంగార్డులు మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. రేపల్లె పట్టణ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ గత ఏడాది జూన్ 2న మరణించిన హోంగార్డు శేషు కాంతారావు కుటుంబానికి తోటి హోంగార్డులు రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని ఎస్పీ రవిశంకర్‌రెడ్డి చేతుల మీదుగా హోంగార్డు కుమార్తె హనీకి అందజేశారు. కాగా పొన్నూరు, రూరల్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యం వల్ల స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన కుమార్‌కు తోటి హోంగార్డులు రూ. 4లక్షల ఆర్థికసాయాన్ని ఎస్పీ చెక్కు రూపంలో అందజేశారు. సాటి హోంగార్డులకు సాయం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన హోంగార్డులను ఎస్పీ రవి శంకర్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఐ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ప్రొటోకాల్ పాటించడంలేదు

● వినుకొండ ఐదో వార్డు కౌన్సిలర్ అంజలిదేవి ఫిర్యాదు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 13: వినుకొండ మున్సిపల్ అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని వినుకొండ ఐదో వార్డు టీడీపీ కౌన్సిలర్ అంజలిదేవి ఫిర్యాదు చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో ఆమె ఈ ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా అంజలిదేవి మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ వైసీపీ నేతలకు వత్తాసు పలుకుతున్నారని, ఎన్నికల ముందు అభివృద్ధి పేరుతో ఇటీవల జరిగిన కార్యక్రమంలో కౌన్సిలర్‌గా, ఒక ప్రజాప్రతినిధిగా తనకు కనీస సమాచారం కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రోద్బలంతో అధికారులు కూడా తనకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. వినుకొండ ఐదోవార్డు వైసీపీ నేత తానే కౌన్సిలర్ అని చెప్పుకుంటున్నారని, అందుకు అధికారులు కూడా సహకరిస్తున్నారన్నారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పోలూరి సురేష్‌బాబు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

16న జరిగే సమ్మెను జయప్రదం చేయాలి

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 13: దేశవ్యాప్తంగా ఈ నెల 16న జరిగే గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ సభ్యుడు కంబాల ఏడుకొండలు అన్నారు. సోమవారం నరసరావుపేట వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ప్రగతిశీల కార్మిక సమాఖ్య ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కంబాల ఏడుకొండలు మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రైతులకు గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా, రైతు నల్లచట్టాలను తొలగించకుండా, కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్మిక చట్టాలను తొలగించి, లేబర్‌కోడ్‌లను తీసుకురావటం దారుణం అన్నారు. కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమంలో పీడీఎం నాయకులు వై వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జీ రామకృష్ణ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, ఉప్పలపాటి రంగయ్య, సీఐటీయూ ఎస్‌కే శిలార్, బక్కా బ్రహ్మయ్య, స్వరూప్, కేఎన్‌పీఎస్ కే కృష్ణ, శిఖినం చిన్నా, ఎంఐఎం దరియావలి, కోటేశ్వరరావు, వీ పేరయ్య, కోలా నవజ్యోతి, కోటా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కర్లకుంటలో వెంకటేశ్వర్లు విగ్రహావిష్కరణ



కర్లకుంటలో వెంకటేశ్వర్లు విగ్రహావిష్కరణలో పాల్గొన్న జీవీ, అరవిందబాబు, నల్లపాటి రాము, కడియాల వెంకటేశ్వరరావు తదితరులు

రొంపిచర్ల, ఫిబ్రవరి 13: మండలంలోని కర్లకుంటలో మాజీ సర్పంచ్ మందలపు వెంకటేశ్వర్లు విగ్రహాన్ని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు మంగళవారం ఆవిష్కరించారు. తొలుత గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ చదలవాడ అరవిందబాబు, టీడీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, నల్లపాటి రాము, కడియాల లలిత సాగర్ తదితరులు పాల్గొన్నారు. సర్పంచ్‌గా మందలపు వెంకటేశ్వర్లు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల టీడీపీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



వెంకుపాలెం గ్రామంలో కరపత్రాలను గ్రామస్థులకు అందచేస్తున్న జనసేన నాయకులు కొణిజేటి నాగశ్రీను తదితరులు

జనసేన-టీడీపీ కలయికను స్వాగతిస్తున్న ప్రజలు

● జనసేన పార్టీ సమన్వయకర్త కొణిజేటి నాగశ్రీను

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 13: రాష్ట్రంలో జనసేన-టీడీపీ పార్టీల కలయికను ప్రజలు స్వాగతిస్తున్నట్లు వినుకొండ జనసేన పార్టీ సమన్వయకర్త కొణిజేటి నాగశ్రీను అన్నారు. మండలంలోని వెంకుపాలెంలో జనంలోకి జనసేన టీడీపీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా నాగశ్రీను గ్రామస్థులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి ఉమ్మడి మేనిఫెస్టో కరపత్రాలను అందచేశారు. అనంతరం రానున్న ఎన్నికల్లో జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గంధం సుబ్బారావు, జనసేన నాయకులు గండికోట మణికంఠ, అడపాల అనిల్‌కుమార్, గణప రమేష్, పసుపులేటి రజబాబు, గురుబ్రహ్మం, అడపాల శ్రీనివాసరావు, చిరంజీవి, గుడిపాటి కృష్ణయాదవ్, అక్కయ్య, బొమ్మిశెట్టి వెంకటనారాయణ, సింగంశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చిన్న పిల్లలకు కంటి చికిత్స

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 13: నెలలు నిండకుండా, తక్కువ బరువుతో పుట్టిన పిల్లలకు రాజమండ్రి గౌతమి నేత్రాలయం సహకారంతో రెటినోపతి ఆఫ్ మెచ్యూరిటీ నిర్వహించనున్నట్టు నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాల వైద్యులు తెలిపారు. మంగళవారం 12మంది పిల్లలకు పరీక్షలు నిర్వహించినట్టు వారు తెలిపారు. ప్రతినెల పరీక్షలుచేసి ఏమైనా సమస్యలు ఉంటే ఉచితంగా వైద్యం అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేశ్వరి, హైందవి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి

రొంపిచర్ల, ఫిబ్రవరి 13: విద్యుత్ లైన్‌ల ఏర్పాటు కారణంగా పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని పరగటిచర్ల గ్రామానికి చెందిన రైతులు మంగళవారం డిమాండ్ చేశారు. నివేదికలను తయారు చేసేటప్పుడు ఒక్కొక్క రైతుకు రూ.లక్ష మేర ఇస్తామని చెప్పి ప్రస్తుతం రూ.10వేలు ఇస్తామంటున్నారని తెలిపారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం నష్టపరిహారం తక్కువ ఇస్తున్నారని తెలిపారు. 765 కేవీ బీ/సీ వరంగల్, చిలకలూరిపేట విద్యుత్ లైన్ నిర్మాణంలో పంట సాగుచేసే భూమి నష్టపోతుందని తెలిపారు. గత సంవత్సరం ఐదో నెలలో దీనికి సంబంధించి నోటీసులు రైతులకు ఇచ్చారని తెలిపారు. తమకు తగిన న్యాయం చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నిత్యజీవితం సైన్స్‌తో ముడిపడి ఉంది

జిల్లా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు సభలో కలెక్టర్



విజేతలతో పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్

నరసరావుపేట కల్చరల్, ఫిబ్రవరి, 13. నిత్యజీవితం సైన్స్‌తో ముడిపడి ఉన్నదని పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి అన్నారు. మంగళవారం పట్టణంలోని సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు సభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ శాస్త్రవేత్తలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు విద్యార్థి దశ నుంచి శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలన్నారు. సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించుకుని ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఐదేళ్లుగా పాఠశాల విద్యావ్యవస్థలో పెనుమార్పులు తీసుకువచ్చిందన్నారు. డిజిటల్ క్లాస్‌రూంలు ఏర్పాటు చేసి సాంకేతికత సాయంతో ప్రభుత్వ పాఠశాలల్లో వినూత్న బోధనకు శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. ఇంగ్లీషు విద్యను ప్రవేశపెట్టి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు.

కార్యక్రమంలో ఎన్.ఐ.ఎఫ్ జ్యూరీ మెంబర్ డాక్టర్ మహిమ, జిల్లా విద్యా శాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు, సెంట్రల్ స్కూల్ సిస్టర్ విక్టోరియా, జిల్లా సైన్స్ అధికారి ఎ.ఎ. మధుకుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను దగాచేసిన జగన్‌రెడ్డి ప్రభుత్వం

● మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

● ఎన్నికలముందు దగా డీఎస్సీపై యువత నిరసన



దగా డీఎస్సీకి నిరసనగా పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టిన యువత, ర్యాలీలో పాల్గొన్న జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఫిబ్రవరి 13: ఎన్నికల ముందు నిరుద్యోగులను మోసం చేసేందుకు సీఎం జగన్‌రెడ్డి దగా డీఎస్సీని విడుదల చేయడం దుర్మార్గమని, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విమర్శించారు. నియోజకవర్గ తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్, ఐటీడీపీ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీని విడుదల చేయటంపై పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్, స్తూపం సెంటర్ మీదుగా నర్సరావుపేట రోడ్డులో అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ర్యాలీకి జీవీ ఆంజనేయులు సంఘీభావం తెలిపి ర్యాలీలో పాల్గొన్నారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 24వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే నాలుగేళ్లుగా ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వకుండా, వైసీపీ ప్రభుత్వం నేడు యువతను మోసం చేసేందుకు 6100 ఉపాధ్యాయ పోస్టులకు ఎన్నికల ముందు ప్రకటించటం ముమ్మాటికీ మోసమేనని అన్నారు. చాలామంది నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురుచూస్తూ, కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుని అర్ధాకలితో మగ్గుతుంటే, దుర్మార్గపు ప్రభుత్వం యువతను దగా చేసిందన్నారు. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తామని నిరుద్యోగులను మోసం చేసిందని విమర్శించారు. టీడీపీ పాలనలో చంద్రబాబు నాయుడు లక్షలాదిమంది నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారని తెలిపారు. జగన్‌రెడ్డి మాటలు నమ్మి ఓట్లేసిన యువతకు చేసిన దగాపై పోరాడుతున్న యువతే జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకలించి గద్దెదించడం ఖాయమన్నారు. గత ప్రభుత్వ హయాంలో తెచ్చిన నిధులతో అభివృద్ధి చేసి, తానే అభివృద్ధి చేసినట్లు జబ్బలు చరుచుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. హనుమాన్‌నగర్ సమీపంలో 11లక్షల లీటర్ల సామర్థ్యం గల నీటి ట్యాంక్ నిర్మించిన ఘనత టీడీపీదే అన్నారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు బోడేపూడి శంకర్, లగడపాటి శ్రీను, జానీ, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు కూరపాటి హనుమంతరావు, నర్రా కిషోర్, వీరగంధం ఆనంద్, చింత గంగయ్య, ప్రశాంత్, తూమాటి కాశీ, జిమ్‌జానీ, సాహెబా, అబ్బూరి శ్రీకాంత్, గోనుగుంట్ల ధనుంజయ్, బొల్లా సుబ్బారావు, నిమ్మకాయల బాబురావు, మేడ అశోక్, మేదరమెట్ల అనీల్, కరీమ్, ఖాజా, సాయి, చంద్రశేఖర్‌రెడ్డితో పాటు టీడీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు సీఎం కావాలి

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

● వైసీపీ నుంచి టీడీపీలోకి కొనసాగుతున్న వలసలు



పార్టీలో చేరిన వారితో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 13: రాష్ట్రంలో మళ్లీ అభివృద్ధి పట్టాలు ఎక్కాలన్నా, గ్రామాలు తిరిగి కోలుకోవాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రి అవ్వాలని మాజీ మంత్రి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. కొన్ని రోజులుగా వైసీపీ నుంచి టీడీపీలోకి కొనసాగుతున్న వలసల పరంపరం సోమవారం రాత్రి కూడా కొనసాగింది. చిలకలూరిపేట మండలం కొత్తరాజాపేటకు చెందిన 20కుటుంబాలు, గొట్టిపాడుకు చెందిన ఆరు కుటుంబాలు టీడీపీలో చేరారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారందరికీ కండువాలు కప్పి ప్రత్తిపాటి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలంతా స్పష్టతతో ఉన్నారని ఎలాంటి స్వప్రయోజనాలు ఆశించని సామాన్య కార్యకర్తలు సైతం వైసీపీకి దూరం అవుతున్నారనంటే ఇకనైనా జగన్ ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు జవ్వాజి మదన్ మోహన్, కొత్తరాజాపేట పార్టీ నాయకులు గోపాళం శ్రీనివాసరావు, గంజి శ్రీనివాసరావు, కృష్ణ, వేణు, బిక్షాలు, గొట్టిపాడు గ్రామ పార్టీ నాయకులు శివ, చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో నిరుద్యోగులే స్టార్ క్యాంపెయినర్లు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 13: రాష్ట్రవ్యాప్తంగా భగ్గుమంటున్న డీఎస్సీ అభ్యర్థుల ఆందోళన సాక్షిగా వచ్చే ఎన్నికల్లో విపక్షాలకు నిరుద్యోగులే స్టార్ క్యాంపెనర్లుగా ఉండబోతున్నారని మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. పట్టణంలోని 9వ వార్డు రజక, సీఆర్ కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్తిపాటి టీడీపీ మేనిఫెస్టో కార్డులను ఇంటింటికి పంపిణీ చేసి టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేసే సూపర్-6 పథకాల గురించి వివరించారు. ఒక మోసగాని మాటలు నమ్మిన పాపానికి మెగా డీఎస్సీ పేరిట వారిని అన్ని విధాలా దగా చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగుల ఇబ్బందులను గమనించి లోకేశ్ జాబ్ క్యాలెండర్ ప్రతి సంవత్సరం డీఎస్సీ వేస్తామని హామీ ఇచ్చారని ప్రత్తిపాటి గుర్తుచేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన సమన్వయకర్త తోట రాజారమేష్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు పఠాన్ సమద్‌ఖాన్, పట్టణ ప్రధాన కార్యదర్శి మొద్దుమాల రవి, జనసేన నాయకులు మునీర్, సుభానీ తదితరులు పాల్గొన్నారు.

18న పౌర హక్కుల సంఘం మహాసభ

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 13: పౌరహక్కుల సంఘం గుంటూరు జిల్లా 20వ మహాసభలను మంగళగిరి సీపీఐ కార్యాలయంలో ఈ నెల 18న జరుగుతాయని జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు అన్నారు. సోమవారం నరసరావుపేట ఎన్‌జీవో హోమ్‌లో పౌరహక్కుల సంఘం గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా ఉమ్మడి జిల్లా 20వ మహాసభలను జయప్రదం చేయాలని కరపత్రంను ఆవిష్కరించారు. కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జీ రామకృష్ణ, భారత బచావో జిల్లా అధ్యక్షుడు వీ కోటనాయక్, కోలా వనజ్యోతి, పీకేఎస్ నాయకుడు కంబాల ఏడుకొండలు, ఎస్.సాంబయ్య, కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కే కృష్ణ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, ఏరియా కార్యదర్శి రంగయ్య, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 13: ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్ ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళవారం తెల్లవారు జామున పట్టణంలోని వినుకొండ రోడ్డులోని జిలానీ పెట్రోల్ బంకు వద్ద చోటుచేసుకుంది. మండలంలోని కొండకావూరుకు చెందిన సాయి కృష్ణ (30) అనే వ్యక్తి వినుకొండ వైపు నుంచి నరసరావుపేట వస్తుండగా నరసరావుపేట నుంచి ఉప్పలపాడు వైపు వెళ్తున్న శేఖర్ అనే వ్యక్తి మోటారు సైకిల్‌తో ఎదురుగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో సాయి కృష్ణ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు మృతుని భార్య విజయలక్ష్మి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. కాగా తమకు తక్షణ న్యాయం చేయాలని కోరుతూ నిందితుడిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని మృతుని బంధువులు ప్రభుత్వ వైద్యశాల ఎదుట ధర్నాకు దిగారు. సమాచారం అందుకున్న మొదటి పట్టణ సీఐ కృష్ణారెడ్డి, ఎస్ఐ వినోద్ కుమార్‌లు ప్రభుత్వ వైద్యశాలకు వద్దకు వెళ్లి వారితో చర్చించి ధర్నాను విరమింప చేశారు.

పోలీస్ స్టేషన్ ఎదుట వ్యక్తి మృతి

రొంపిచర్ల, ఫిబ్రవరి 13: మండలంలోని రొంపిచర్ల పోలీసు స్టేషన్ ఎదుట విప్పర్ల గ్రామానికి చెందిన గోగసాని కబ్బయ్య (60) మంగళవారం మృతి చెందాడు. రొంపిచర్ల పోలీసు స్టేషన్‌లో ఒక కేసు విషయమై స్టేషన్ వద్దకు వచ్చాడు. స్టేషన్ బయట టీ తాగుతూ కుప్పకూలి మృతి చెందాడు. హుటాహుటీన అతని బంధువులు అతన్ని వాహనంలో నరసరావుపేటకు తీసుకు వెళ్తుండగా మృతి చెందినట్టు గుర్తించారు. కాగా ఈ విషయంపై ఎస్ఐ పాల్ రాజ్ రవీంద్రను అడగ్గా స్టేషన్ బయట సంఘటన జరిగిందని తెలిపారు. వారి బంధువులు అతను కుప్పకూలిపోవటంతో వాహనంలో తీసుకు వెళ్లారని తెలిపారు.

పల్నాడు ప్రజలకు అనీల్‌కుమార్ యాదవ్ క్షమాపణ చెప్పాలి

రొంపిచర్ల, ఫిబ్రవరి 13: మాజీమంత్రి అనీల్‌కుమార్ యాదవ్ పల్నాడు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ కొలికొండ కొండలు మంగళవారం డిమాండ్ చేశారు. మంత్రిగా ఉన్న సమయంలో పోలవరం ప్రాజెక్టును ఆయన పూర్తిచేసి ఉంటే పల్నాడు సస్యశ్యామలంగా ఉండేదన్నారు. అదేవిధంగా పల్నాడు జిల్లాలో ముగ్గురు యాదవ సామాజికవర్గీయులను వైసీపీ ప్రభుత్వం హత్య చేసిందన్నారు. ఆ కుటుంబాలను పరామర్శించకుండా ఏ మొఖం పెట్టుకొని పల్నాడు జిల్లాకు వస్తున్నావని, వీటికి సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 13: పట్టణంలోని సింగ్‌నగర్ మద్యం దుకాణం వద్ద కొద్ది రోజుల క్రితం జరిగిన దాడి కేసులో నిందితుడైన భూక్యా వెంకటేశ్వర్లు నాయక్‌ను అర్బన్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వెంకటేశ్వర్లు నాయక్ చేసిన దాడిలో సురేష్ నాయక్ తీవ్రంగా గాయ పడి రెండు రోజుల క్రితం మృతి చెందిన విషయం విదితమే.

అప్రెంటీస్ విధానం ఉపసంహరించుకోవాలి: యూటీఎఫ్

వినుకొండ, ఫిబ్రవరి 13: ఉపాధ్యాయ నియామకాల్లో బానిస వ్యవస్థగా ఉన్న అప్రెంటీస్ విధానం తిరిగి 2024 డీఎస్సీ నియామకాల ఉత్తర్వులలో ప్రవేశపెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ అన్నారు. పట్టణంలో ఇటీవల ప్రభుత్వ విడుదల చేసిన ఉపాధ్యాయ నియామకాల నోటిఫికేషన్ జీవో ప్రతులను మంగళవారం ఉపాధ్యాయులతో కలిసి దహనం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రవి. జిలానీ, పోలయ్య, రమేష్ బాబు, నాగేంద్రుడు, వెంకటరెడ్డి, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ పథకంతో క్రీడామైదానాల అభివృద్ధి: ఎంఈవో

శావల్యాపురం, ఫిబ్రవరి 13: పీఎంశ్రీ పథకానికి ఎంపికైన జడ్పీ పాఠశాలలలో కేంద్ర ప్రభుత్వం క్రీడా మైదానాల అభివృద్ధికి శ్రీకారం చుట్టిందని ఎంఈవో మద్దిగుంట్ల సాంబశివరావు అన్నారు. పీఎంశ్రీ నిధులతో స్థానిక జడ్పీ పాఠశాలలో క్రీడామైదానం మరమ్మతులను మంగళవారం ప్రారంభించారు. ఎంఈవో మాట్లాడుతూ క్రీడామైదానంలోని మెరకను తవ్వి వచ్చిన మట్టిని పల్లపు ప్రాంతానికి తరలించి చదును చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం బాల్‌బ్యాడ్మింటన్ కోర్టును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బొడ్డపాటి విజయలక్ష్మి, ఏఈ విశ్వనాథ్, ఉపాధ్యాయులు బీవీ నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి, రికార్డు అసిస్టెంట్ కొడాలి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి గానామృతం



పూజల్లో పాల్గొన్న భక్తులు

నరసరావుపేట అర్బన్, ఫిబ్రవరి 13: నరసరావుపేట పట్టణంలోని మునిసిపల్ కార్యాలయ ప్రాంగణంలోని కళ్యాణ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం వెంకటేశ్వర స్వామి గానామృతం చేశారు. స్వామి వారికి ఆలయ అర్చకులు చతుర్వేదుల భ్రమర కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాల్య వివాహాలతో భావితరాలకు తీరని నష్టం: ఎంపీడీవో

నూజెండ్ల, ఫిబ్రవరి 13: బాల్య వివాహాలను అరికట్టకుంటే భావి తరాలకు తీరనినష్టం జరుగుతుందని ఎంపీడీవో వీరభద్రాచారి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం అంగన్‌వాడీ టీచర్లు, సచివాలయ మహిళా కార్యదర్శులు, వైద్య సిబ్బందికి బాల్య వివాహాలను అరికట్టడంపై తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వీరభద్రాచారి మాట్లాడుతూ చిన్న వయస్సులో పిల్లలకు పెళ్ళిళ్ళు చేయటం వల్ల వారు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. బాల్య వివాహాలను నియంత్రించేందుకు హెల్ప్‌లైన్ నెంబరు 1098ను అందరికీ తెలిసే విధంగా ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు జ్యోతమ్మ, శివ నాగలక్ష్మి, నాగరాజ కుమారి తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేలో అధికారుల నిర్లక్ష్య ధోరణి

9(2) నోటీసులు కొడుక్కి.. పాసుపుస్తకం చనిపోయిన తండ్రికి



చనిపోయిన సుబ్బరాయుడు పేరుతో ఇచ్చిన పాసుపుస్తకం

పిచికలపాలెం (శావల్యాపురం) ఫిబ్రవరి 13: భూవివాదాల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో అధికారుల నిర్లక్ష్య ధోరణితో సమస్యల పరిష్కారమేమో గాని కొత్త సమస్యలు పుట్టుకొస్తున్నాయి. పిచికలపాలెం గ్రామానికి చెందిన నడింపల్లి నాగేశ్వరరావుకు సర్వే నెంబర్ 191లో 0.74సెంట్లు పొలం ఉండగా రీసర్వే అధికారులు భూమిని కొలిచి ఆయన పేరుమీదే 9 (2)నోటీసులు జారీచేశారు. ఆయన తండ్రి నడింపల్లి సుబ్బరాయుడు చనిపోగా ఆయన పేరుతో 304-ఏ సర్వేనెంబర్‌లో ఉన్న 0.84సెంట్లు భూమి ఉండగా భార్య నాగరత్నం పేరుతో 9 (2) పత్రాన్ని ఇచ్చారు. తీరా పాసుపుస్తకాలిచ్చే సమయానికి కొడుకు నాగేశ్వరరావు పొలాన్ని కూడా చనిపోయిన ఆయన తండ్రి సుబ్బరాయుడు పేరుతో నమోదుచేసి పాసుపుస్తకం ఇచ్చారు. దీనిపై నాగేశ్వరరావు వీఆర్వో అమలను కలసి అడగగా తహసీల్దార్‌ను కలసి దరఖాస్తు చేసుకొంటే సవరణ చేస్తామని చెప్పడంతో బాధితుడు లబోదిబోమంటున్నాడు. నాగేశ్వరరావు తనకున్న పొలాన్ని బ్యాంక్‌లో పెట్టి రుణాన్ని తీసుకొన్నాడు. ఈ ఏడాది పంటలు సక్రమంగా లేకపోవడంతో మార్చి నెలాఖరుకు వడ్డీ వరకు చెల్లించి రుణాన్ని రెన్యూవల్ చేసుకోవాలనుకొన్నాడు. కానీ ఇప్పుడు అతని పేరుతో పొలమే లేకుండా పోవడంతో తాను రుణాన్ని రెన్యూవల్ ఎలా చేసుకోవాలని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. దీన్నిబట్టి రీసర్వేలో అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించారో అర్థంచేసుకోవచ్చు. అధికారుల తీరుపై గ్రామస్థులు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రీసర్వేలో జరిగిన పొరపాట్లను సవరించి బాధితులందరికీ న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరారు.

జేఈఈ మెయిన్స్‌లో యడ్లపాడు విద్యార్థికి 100 పర్సంటైల్

● వంకాయలపాడు విద్యార్థికి 99.51 పర్సంటైల్



ముత్తవరపు అనూప్, షేక్ షరీఫ్

యడ్లపాడు, ఫిబ్రవరి 13: జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్స్-2024 పరీక్షలలో మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచారు. జాతీయ పరీక్షల సంస్థ మంగళవారం విడుదల చేసిన సెషన్-1 ఫలితాలలో యడ్లపాడు గ్రామానికి చెందిన ముత్తవరపు రాజ్‌కుమార్ కుమారుడు అనూప్ 100పర్సంటైల్‌ను సాధించగా వంకాయలపాడు గ్రామానికి చెందిన షేక్ సుభాని కుమారుడు షరీఫ్ 99.51 పర్సంటైల్‌ను సాధించి, జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారు. అనూప్ హైదరాబాద్‌లోని నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా, షరీఫ్ విజయవాడలోని చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తమ పిల్లలు అత్యుత్తమ పర్సంటైల్ సాధించడంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



హుస్సేన్ పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న మాజీమంత్రి ప్రత్తిపాటి

బోయపాలెం (యడ్లపాడు), ఫిబ్రవరి 13: యడ్లపాడు మండలం బోయపాలెం గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతిచెందాడు. స్థానిక టీడీపీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు హుస్సేన్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ప్రత్తిపాటి ఫౌండేషన్ ద్వారా హుస్సేన్ కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కామినేని సాయిబాబు, చిలకలూరిపేట పట్టణ కార్యదర్శి మద్దుమాల రవి, నియోజవకర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జానిబాషా, గ్రామ పార్టీ నాయకులు షేక్ బుడే, అబ్దుల్‌హక్, కార్యకర్తలు ఉన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు

చికలూరిపేటలో...

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 13: పట్టణంలోని 27వ వార్డుకు చెందిన గంధం కొండమ్మ ఇటీవల మరణించటంతో వారి కుటుంబానికి మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రత్తిపాటి ఫౌండేషన్ ద్వారా రూ.10వేలు ఆర్థికసాయాన్ని టీడీపీ నాయకులు మారుబోయిన శ్రీనివాసరావు, నల్లమోతు వెంకాయమ్మ, మొద్దుమాల రవి, షేక్ కాలేషావలి, అందెల సుమంత్, కోటిలు అందజేశారు.